వెన్నెల వేసవి
రూ॥60/-
పేజీలు:54

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఈళవ ఓట్లపై అందరి కన్ను
కేరళలో అన్ని వర్గాలు ఎల్‌డిఎఫ్‌కే మొగ్గు

యూరియా దిగుమతికి కేంద్రం కసరత్తు

05

సంపుటి 28, సంచిక: 283 | మంగళవారం | 07-04-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

# ఆరేళ్ళు... ఐదు కుటుంబాలు

‘భారతదేశంలో అసమానతలు సామాన్యుడు ఊహించలేని, అంచనా వేయలేని స్థాయికి చేరుకున్నాయి. మన దేశంలో బిలియనీర్ల(శతకోటీశ్వర్ల) సంఖ్య 1991లో ఒకే ఒక్క వ్యక్తి నుండి 2025 నాటికి 358 మందికి పైగా పెరిగింది. వీరు జాతీయ సంపద (జిడిపి)లో 40 శాతం కంటే ఎక్కువ భాగాన్ని నియంత్రిస్తున్నారు.

- 400 శాతం పెరిగిన ఐదు కుటుంబాల సంపద • 625 శాతం పెరుగుదలతో అగ్రగామిగా అదానీ • 153 శాతంతో తరువాతి స్థానంలో అంబానీ • అదే రీతిలో పెరిగిన సావిత్రి, జిందాల్, సునీల్ మిత్తల్, శివ నాడార్‌ల సంపద
- 2019-2025 మధ్యకాలంలో లెక్కలు వెల్లడించిన సిఎఫ్ఎ, ‘ట్యాక్స్ ది టాప్’ సంస్థలు • 1,688 మందిపై సంపద పన్ను విధిస్తే ఏటా రూ.10.63 లక్షల కోట్లు • దాంతో అందరికీ ఉచిత వైద్యం, వృద్ధాప్య పెన్షన్ నెలకు రూ.12వేలు • పదవ తరగతి విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు

**న్యూఢిల్లీ** :భారతదేశంలో పెరుగుతోన్న సంపద అసమానతలకు సంబంధించి కొన్ని ఆశ్చర్యకరమైన వాస్తవాలను ‘వెల్త్ ట్రా కర్ ఇండియా 2026’ అనే ఇటీవల విడు దలైన నివేదిక వెల్లడించింది. 2019 నుండి 2025 మధ్యకాలంలో అత్యంత సంపన్నమైన 5 ధనిక కుటుంబాలు తమ సంపదను 400 శాతం మేరకు పెంచుకున్నాయి. ఆ కుటుంబాలలో ముఖేశ్ అంబానీ, గౌత మ్ అదానీల తో పాటు సావిత్రి జిందాల్ , సునీల్ మిత్తల్, శివ్ నాడార్‌ల కుటుంబా లు ఉన్నాయి. 2019-24 నాటికి సంపద లో దిగువ 50 శాతం జనాభా వాటా 6.4 శాతం వద్ద స్తంభించిపోయింది. ఇదే కాలంలో అంబానీ సంపద 153 శాతం పెరగగా, అదానీ సంపద ఏకంగా 625 శాతానికి ఎగబాకింది. సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ అకౌంటబిలిటీ , ‘టాక్స్ ది టాప్ క్యాంపెయిన్’ అనే ప్రచారోద్యమ సంస్థ ప్రచురించిన ఈ నివేదిక ప్రకారం తరువాయి 2లో



## భారీగా పెరిగిన గృహ రుణాలు


సాధారణ భారతీయులు రుణాలు తీసుకోవడంతో, ఇదే కాలంలో గృహ రుణాలు (హౌజ్ హోల్డ్ డెట్) కూడా భారీగా పెరిగాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ రుణాలలో అధిక భాగం ఉత్పాదక ప్రయోజనాల కోసం గానీ లేదా ఆస్తులను కొనుగోలు చేయడానికి గానీ కాకుండా, కేవలం దైనందిన జీవన అవసరాలను తీర్చుకోవడానికి మాత్రమే తీసుకున్నారని ఈ నివేదిక సూచిస్తోంది. గృహ రుణాల మొత్తం 2019-20లో రూ.69.9 లక్షల కోట్ల నుండి 2024-25 నాటికి రూ.136.6 లక్షల కోట్లకు పెరిగింది. అంటే కేవలం ఐదేళ్ల కాలంలోనే ఇది దాదాపు రెట్టింపు అయ్యింది.

## వారిపై పన్ను వేస్తే ఏటా రూ.10.63 లక్షల కోట్లు..

రూ.1000 కోట్లకు పైగా సంపద కలిగిన 1,688 అత్యంత ధనిక కుటుంబాలపై 2 శాతం నుంచి 6శాతం వృద్ధిక్రమానుగత సంపద పన్ను, మూడింట ఒక వంతు వారసత్వ పన్ను విధించడం ద్వారా ప్రజలపై ఏటా రూ.10.63 లక్షల కోట్లు ఖర్చు చేయడానికి సరిపడా నిధులను సమకూర్చుకోవచ్చని ఆ నివేదిక వివరించింది. అందులో సంపద పన్ను కింద రూ. 4.67 లక్షల కోట్లు, వారసత్వ పన్ను కింద రూ.2.77 లక్షల కోట్లు, ఈ మొత్తం ఖర్చు చేయడం ద్వారా కింద స్థాయిలో నగదు పంపిణీ జరిగి 15 శాతం వివిధ పన్నుల రూపంలో సమకూరే మొత్తం కలిపితే రూ.10.63 లక్షల కోట్లు అవుతాయని నివేదిక వివరించింది. ఈ నిధులతో జిడిపిలో 1 శాతం వరకు ఆరోగ్య వ్యయాన్ని తక్షణమే పెంచడం, జిడిపిలో 1 శాతం తరువాయి 2లో

# 45 రోజుల కాల్పుల విరమణ యత్నాలు ?

- ప్రతిపాదనలు పరిశీలిస్తున్న అమెరికా-ఇరాన్ • పాక్ సూత్రధారిగా టర్కీ, ఈజిప్టులతో మధ్యవర్తిత్వ ప్రతిపాదన • దూతలతో జె.డి.వాన్స్ ముమ్మర సంప్రదింపులు • తాత్కాలిక సంధిని తోసిపుచ్చిన ఇరాన్



**ఇస్లామాబాద్:** పశ్చిమాసియా పరిస్థితులు ప్రపంచ యుద్ధానికి చేరువు అవుతున్న దశలో ఆకస్మికంగా పరిణామాల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పాకిస్థాన్,టర్కీ,ఈజిప్టు మధ్యవర్తి దేశాలు కొనసాగిస్తున్న ప్రయత్నాల్లో భాగంగా 45 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనలు తెరమీదకు వచ్చాయి. ఒకవైపు యుద్ధం కొనసాగుతుంటే మరోవైపు ట్రంప్ ఈ విధంగా మళ్ళీ శాంతి ప్రణాళిక ఆట కొనసాగిస్తున్నారు. ఈ కాల్పుల విరమణ ప్రతిపాదనలను అమెరికా-ఇరాన్‌లకు పంపించారని, వారు పరిశీస్తున్నట్లు రాయిటర్స్ న్యూస్ ఏజన్సీ, యాక్సియస్‌లు ప్రకటించాయి. 45 రోజులు కాల్పుల విరమణ, హోర్ముజ్ అంశాలు ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయన్నది ప్రధాన సమాచారం. రాయిటర్స్ సమాచారం ప్రకారం ఈ యుద్ధం ముగించేందుకు ప్రతిపాదనలు తయారు చేయడంలో పాకిస్థాన్ కీలకపాత్ర వహిస్తోంది. గతంలో అమెరికా ప్రతిపాదించిన 15 అంశాలకు, ఈ ప్రతిపాదనలకు దగ్గర పోలికలున్నాయన్న అంశం బయటకు పొక్కింది. పాకిస్థాన్, టర్కీ, ఈజిప్టు దేశాలు ఈ మధ్యవర్తిత్వంలో భాగం పంచుకున్నాయి. ఐతే తాత్కాలిక సంధి మార్గాలను ఇరాన్ తోసిపుచ్చినప్పటికీ మధ్యవర్తి దేశాలు చేసిన ప్రతిపాదనలను ఇరాన్ నాయకత్వగణం నిశితంగా పరిశీస్తోంది. మరోవైపు అసలు అమెరికా కాల్పుల విరమణకు సిద్ధంగా ఉందా? అనే సందేహాలు కూడా ఇరాన్ వైపు నుండి వ్యక్తం అయినట్లు సమాచారం. హోర్ముజ్ జలసంధిని గడువులోపు తెరవకపోతే మంగళవారం ఉదయం నాటికి ఇరాన్‌లోని కీలక వ్యవస్థలపై ఘోరమైన దాడులు చేస్తామని, నరకం చూస్తారని ట్రంప్ తీవ్ర హెచ్చరికలు చేసిన తర్వాత దాడులు మొదలు కాకముందే ఈ మధ్యవర్తిత్వ చర్చల ప్రతిపాదనల అంశం తెరమీదకు రావడం విశేషం. ఈ విధంగా శాంతి ప్రతిపాదనలు చేయడం ఇదే మొదటిసారి కాదు. పాకిస్థాన్ మధ్యవర్తిగా మార్చి 24వ తేదీన 15 అంశాల శాంతి ప్రణాళికను ట్రంప్ ఇరాన్‌కు పంపించారని వార్తలు వచ్చాయి. అదేసమయంలో ఇరాన్ కొత్త నాయకత్వం చర్చలు కోరుకుటోందని, చర్చలు ముమ్మరంగా ముందుకు సాగుతున్నాయని, ఒక ఒప్పందానికి చేరువలో ఉన్నామని ట్రంప్ ప్రకటించారు. ఈ వార్తలను ఇరాన్ పదే పదే తిరస్కరించింది. అవన్నీ బూటకపు వార్తలుగా కొట్టిపారేసింది. కీలకమైన అణుస్థావరాలను ధ్వంసంచేయాలని, పశ్చిమాసియాలో ఉగ్రవాద సంస్థలను పెంచిపోషించకూడదని, వారికి నిధులు ఇవ్వకూడదని, హోర్ముజ్‌ను తెరవాలని, అందుకు ప్రతిగా ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు ఎత్తివేస్తుందని ఈ 15 అంశాలలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ట్రంప్ ఇప్పటికే మూడు విడతలుగా మొత్తం 16 రోజులు ఇరాన్‌కు గడువు ఇచ్చారు. ఇదే తుది విడత హెచ్చరిక అని బెదిరించారు. ఇరాన్‌ను లొంగదీసేయత్నం చేశారు. ఆ తర్వాత మార్చి 31న చైనా-పాకిస్థాన్ కలిసి ఐదు అంశాల ప్రణాళికను తెరమీదకు తెచ్చాయి. ఈ చర్చల గేమ్ మధ్య గల్ఫ్ దేశాలు ఇరాన్ చేతల్లో, దాడుల్లో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాయి. మరోవైపు ఇప్పుడు మంగళవారం తాజా అమెరికా ఉపాధ్యక్షుడు జెడి.వాన్స్ కూడా దూతలతో ముమ్మరంగా సంప్రదింపులు తరువాయి 2లో

# సైకిల్‌పై ఎవరెస్ట్ బేస్ క్యాంప్

### భారతీయ వనిత సరికొత్త రికార్డు !

**న్యూఢిల్లీ:** కృషి, పట్టుదల, అచంచలమైన ఆత్మవిశ్వాసం, అంకిత భావం ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చు అని ఓ మహిళ నిరూపించింది. పురుషులకు తాము ఏమాత్రం తీసిపోమని రుజువు చేసింది ఉత్తర ప్రదేశ్‌కు చెందిన దివ్య సింగ్. ఖాఠ్మండు నుంచి ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకు 14 రోజుల్లో సైకిల్‌పై ప్రయాణించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె చరిత్ర సష్టించింది. దివ్య సింగ్ సాధించిన ఈ స్ఫూర్తిదాయకమైన ఘనతకు యావత్ దేశ ప్రజల నుంచి ప్రశంసలు లభించాయి. దివ్య సింగ్... నేపాల్ రాజధాని ఖాఠ్మండు నుంచి ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకూ సైకిల్‌పై ప్రయాణించింది. కేవలం 14 రోజుల్లో ఆమె ఈ లక్ష్యాన్ని చేరుకుంది. గడ్డకట్టే చలి, నిటారుగా ఉండే భూభాగం, తక్కువ ఆక్సిజన్ స్థాయిలను ఎదుర్కొంటూ... ఆమె రోజూ గంటల తరబడి తరువాయి 12లో







# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు త్వరలోనే శంకుస్థాపన

- జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం
- వేలాది ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడను మంజూరు చేస్తాం
- ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం మాది కాదు
- ‘పిప్పిరి’ బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

ప్రజాపక్షం/ఆదిలాబాద్/బాసర

గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ సర్కారు తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. ఈ జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్నటువంటి ఆలయాలన్నింటిని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి శంకుస్థాపన చేసిన రేవంత్ రెడ్డి పిప్పిరిలో నిర్వహించిన బహిరంగ సభలో తరువాయి 2లో

# భారత్‌ను చీకట్లో ఉంచారు

### ‘డేటా సార్వభౌమత్వం’పై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శలు



**న్యూఢిల్లీ :** భారతదేశ డేటా సార్వభౌమత్వంపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రపంచ టెక్నాలజీ పోటీలో దేశం ముందుండాలని, కానీ దానికి బదులుగా తన డేటాకు ఎలా రక్షణ కల్పిస్తారనే దానిపై దేశానికి స్పష్టత లేకపోవడం శోచనీయమన్నారు. భారతదేశపు డేటా దాని ప్రజలకు సంబంధించినదని, ఆర్థిక వ్యవస్థలో ఎఐని నిర్మించడం, కంపెనీలను వృద్ధి చేయడం, ఉద్యోగాలను సృష్టించడం వంటివి భారతదేశపు అతిపెద్ద బలాలలో ఒకటిగా నిలవగలదని సోమవారం లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. అమెరికాతో ఇటీవల కుదిరిన వాణిజ్య ఒప్పందం గురించి ఇటీవల తాను ప్రభుత్వాన్ని కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు అడిగానన్నారు. అమెరికాతో అడ్డంకులు తగ్గించడం అంటే మన డేటాకు ఏమిటి అర్థం అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. మన ఆరోగ్య డేటా, ఆర్థిక డేటా, ప్రభుత్వ డేటా బేస్‌లు భారతదేశంలోనే ఉంటాయా? మన సొంత ఎఐని నిర్మించుకోవడానికి, డేటా ఇక్కడ నిల్వ చేయమని విదేశీ కంపెనీలను భారతదేశం ఇప్పటికి కోరగలదా? రాహుల్‌గాంధీ తన వాట్సాప్ చానెల్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. మన డేటా సార్వభౌమత్వం, ఆరోగ్యడేటా, ఎఐ, స్థానిక డేటా నిల్వపై అడిగిన ప్రతీ ప్రశ్నకూ ఒకేరకమైన సమాధానం లభిస్తుందని, ఫ్రేమ్ వర్క్, బ్యాలెన్స్ అటానమీ పెద్ద పెద్ద పదాలు కానీ, నిర్దిష్టత ఏమీ లేదని పూర్వ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. ప్రభుత్వం చర్చల ద్వారా దేనిని వదులుకుంటుందో దేశానికి చెప్పడానికి నిరాకరిస్తోందని ఆయన ఆరోపించారు. ‘మనం ప్రపంచ టెక్నాలజీ పోటీలో ముందుండాలి కానీ, దానికి బదులుగా మనం భారతదేశ డేటాకు ఎలా రక్షణ కల్పిస్తారనే విషయంలో ప్రజలను చీకట్లో ఉంచారు’ అని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తంచేశారు. దేశ డేటా విషయంలో ప్రజలకు పారదర్శకత, జవాబుదారీతనం తరువాయి 12లో

## తండ్రీకొడుకుల లాకప్‌డెత్ కేసు

# 9 మంది పోలీసులకు ఉరిశిక్ష



**మధురై :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2020 నాటి సత్తాంకుళం తండ్రీకొడుకుల లాకప్ డెత్ కేసులో మధురైలోని ఒకటో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేల్చి 9 మంది పోలీసులకు మరణశిక్ష (డబుల్ డెత్ సెంటెన్స్) విధించింది. తమిళనాడు తూత్తుకుడి జిల్లా సత్తాంకుళంలో ఉండే జయరాజ్, అతని కుమారుడు బెనిక్స్ స్థానికంగా ఓ మొబైల్ షాపు నడుపుతుండేవారు. అయితే కొవిడ్19 లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించి షాపు తెరిచారనే ఆరోపణలో 2020 జూన్ 19న సత్తాంకుళం పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో తన తండ్రిని పోలీసులు కొడుతుండటంతో బెనిక్స్ అడ్డుకున్నాడు. దీంతో అతడిని కూడా అరెస్టు చేశారు. అనంతరం ఇద్దరినీ రాత్రంతా పోలీసులు చిత్రహింసలకు గురిచేశారు. మరుసటి రోజు ఉదయం ఒక పారిశుద్ధ్య కార్మికుడితో రక్తాన్ని శుభ్రం చేయించి ఆధారాలను ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. ఆ తరువాత తండ్రీకొడుకులపై 5 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు, వారిద్దరినీ కోర్టులో హాజరుపరిచి కోవిల్‌పట్టి సబ్‌జైలుకు తరలించారు. అయితే అంతకు ముందు పోలీసులు తీవ్రంగా కొట్టడంతో తండ్రీకొడుకులు జూన్ 23న కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే మరణించారు. పోలీసు కస్టడీలో ఈ మరణాలు సంభవించడంతో సత్తాంకుళం ప్రాంతంలో తీవ్ర తరువాయి 12లో

### భూ సేకరణ అవార్డు వచ్చేవరకూ...

# రైతులను ఖాళీ చేయించొద్దు

### హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

రంగారెడ్డి జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్ ఫీల్ రేడియల్ రహదారి నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ విషయంలో హైకోర్టు రైతులకు ఉపశమనం కల్పించింది. అమన్‌గల్ ప్రాంతంలో మీర్‌ఖాన్‌పేట ఔటర్ రింగు రోడ్ నుంచి రీజినల్ రింగు రోడ్ వరకు చేపట్టనున్న పనుల కోసం భూములు స్వాధీనం చేసుకునే ప్రక్రియలో అవార్డు ప్రకటించే దశ వచ్చే వరకు భూయజమానులను ఖాళీ చేయించరాదని కోర్టు స్పష్టం చేసింది. కోర్టును ఆశ్రయించిన 30 మంది రైతులకు చెందిన 61 ఎకరాల భూమిపై ఈ ఆదేశాలు వర్తిస్తాయని తెలిపింది. యాచారం, కడ్తాల్, అమన్‌గల్ మండలాల్లోని పలు గ్రామాల్లో మొత్తం 554.34 ఎకరాల భూసేకరణకు జారీ చేసిన నోటిఫికేషన్‌లను సవాలు చేస్తూ అన్నేపు జంగయ్యతో పాటు మరికొందరు పిటిషన్ దాఖలు చేశారు. విచారణలో పిటిషనర్ల తరఫు న్యాయవాది భూసేకరణ చట్ట ప్రక్రియలను పాటించలేదని, అభ్యంతరాలను తరువాయి 2లో



### విమర్శనాత్మక ఆలోచనలకు ఆస్కారం లేకుండా

# జెఎన్‌యుపై దాడి

### జెఎన్‌యు ఉపాధ్యాయ సంఘం ప్రజా విచారణలో వెల్లడి
### నివేదికను విడుదల చేసిన డి.రాజా, అమ్రారామ్

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో పరిస్థితులపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది భాగస్వామ్యంతో కూడిన ప్రజా విచారణకు సంబంధించి జెఎన్‌యు టీచర్స్ అసోసియేషన్ రూపొందించిన సమగ్ర నివేదికను సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు, తరువాయి 2లో



## నల్లమల గిరిప్రసాద్‌కు సిపిఐ నాయకులు నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ అగ్ర నాయకులు, జాతీయ మాజీ ఉప ప్రధాన కార్యదర్శి నల్లమల గిరిప్రసాద్ జయంతి సందర్భంగా సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్ధూంభవన్‌లో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ కోసం అనేక త్యాగాలు చేసిన నల్లమల గిరిప్రసాద్ ఆశయాల సాధన కోసం ప్రతి కమ్యూనిస్టూ కృషి చేయాలన్నారు. గిరిప్రసాద్‌కు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, నెర్లకంటి శ్రీకాంత్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ హైదరాబాద్ జిల్లా నాయకుడు చెట్టుకింది శ్రీనివాస్ నివాళులర్పించారు.



## బిసి సబ్సిడీ రుణాలు వెంటనే మంజూరు చేయాలి

రాష్ట్ర బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌ని కోరిన విక్రమ్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో బిసి వర్గాల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే రూ.5లక్షల సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను సోమవారం బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 60 శాతం జనాభా బిసిలదే అని, రాష్ట్ర అభివృద్ధికి ప్రధానంగా కృషి చేస్తున్నది కూడా బిసి వర్గాలేనని అన్నారు. పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలోనూ, రాష్ట్రంలో ప్రజలందరికీ ఉత్పత్తి కులాల ద్వారా సేవ చేసేది కేవలం బిసి కులాలేనని, ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా, బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు సరైన విధంగా మంజూరు కాకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని విమర్శించారు. కులవృత్తులే ఆధారంగా బతికే కుటుంబాలకు ఉచిత మోటార్ సైకిళ్ళు ఇచ్చి వారి అభివృద్ధికి తోడ్పడాలని, కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ పరిస్థితి కొనసాగితే బిసి కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బిసి యువత స్వయం ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ రుణాలు కీలకమని, ప్రభుత్వం ఈ విషయంలో ఆలస్యం చేయకుండా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు ఇంద్రం, కిరణ్ పాల్గొన్నారు.

## పూర్తయిన పర్యాటక సదుపాయాలు ప్రజలకు అందుబాటులోకి తేవాలి

వాణి ప్రసాద్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పూర్తయినప్పటికీ వినియోగంలో లేని పర్యాటక మౌలిక వసతులను తక్షణమే ప్రజలకు అందుబాటులోకి తేవాలని యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ.వాణి ప్రసాద్ ఆదేశించారు.ఈ మేరకు ఆమె, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ (టిజిటిడిసి) మేనేజింగ్ డైరెక్టర్ పి. గౌతమితో కలిసి డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంతో పాటు సంజీవయ్య పార్క్‌లోని మ్యూజికల్ ఫౌంటెన్‌ను సమగ్రంగా పరిశీలించారు. పర్యాటక శాఖ, టిజిటిడిసి ఉన్నతాధికారులు కూడా ఈ పరిశీలనలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో అభివృద్ధి పనులను సమీక్షించిన వాణి ప్రసాద్, లాన్ ప్రాంతాలను ఆకర్షణీయంగా అభివృద్ధి చేసి సందర్శకులకు మెరుగైన అనుభవం కల్పించాలని సూచించారు. అలాగే ఈ ప్రాంగణాన్ని పర్యాటక, సాంస్కృతిక, ప్రజా కార్యక్రమాలకు వినియోగించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. తదుపరి సంజీవయ్య పార్క్‌లో మ్యూజికల్ ఫౌంటెన్ ప్రాజెక్టును సమీక్షించిన ఆమె, ఇప్పటికే పూర్తయిన ఈ ప్రాజెక్టు ఇంకా ప్రజలకు అందుబాటులో లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మ్యూజికల్ ఫౌంటెన్‌ను వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టిజిటిడిసి ఎండి పి. గౌతమి మాట్లాడుతూ, మ్యూజికల్ ఫౌంటెన్ త్వరలోనే ప్రారంభించడంతో పాటు అంబేద్కర్ విగ్రహ ప్రాంగణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నిరంతరం అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ

అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ జారీ

సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కమిషనర్ స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను ఈనెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూటీనీ చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను జారీచేయనున్నట్లు తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ నెలలో అక్రడేషన్ జారీ ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీల సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్‌లు జారీచేస్తామని, జిల్లాలో జిల్లా స్థాయిలో అర్హులైన జర్నలిస్టులు వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆహార కల్తీ పదార్థాలపైన

# ఫుడ్ సేఫ్టీ, పోలీస్ శాఖల సమన్వయంతో నిరంతర తనిఖీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఆహార కల్తీ పదార్థాలపైన ఫుడ్ సేఫ్టీ, పోలీస్ శాఖల సమన్వయంతో నిరంతర తనిఖీలు, ఎన్ ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. నాసిరకం, కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లపైన చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని, భవిష్యత్తులో తనిఖీలను మరింత విస్తరించి, కఠినంగ వ్యవహారిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని జలవిహార్ నుంచి ఐమ్యాక్స్ పక్కనే ఉన్న హెచ్‌ఎండిఎ మైదానం వరకు సోమవారం 'ఫుడ్ సేఫ్టీ అవేర్‌నెస్' వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యనారాయణ, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ప్రజల ఆహార అలవాట్లు, వారి జీవనశైలిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో తినడం, ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం విపరీతంగా పెరగడంతో రాష్ట్రంలో ఫుడ్ ఇండస్ట్రీ కూడా వేగంగా విస్తరించిందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చిన్న, పెద్ద అన్నీ కలిపి సుమారు 1.41 లక్షల ఆహార వ్యాపార సంస్థలు ఉన్నాయని, ఇందులో దాదాపు 80 శాతం పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నాయన్నారు. కొందరు ఆహార పదార్థాలలో కల్తీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇంకొంతమంది ఆహార పదార్థాలలో నాసిరకమైన నూనెలు, నాణ్యతలేని వస్తువులను ఉపయోగిస్తున్నారన్నారు. పదార్థాలతో ఆహార వస్తువులను ప్రజలకు విక్రయిస్తున్నారని తెలిపారు. కల్తీ, నాసిరకమైన ఆహారం తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంఇ ఆహారంతో జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వస్తున్నాయన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నాన్‌కమ్యూనికబుల్ వ్యాధుల భారం పెరిగేందుకు అనారోగ్యకర ఆహార అలవాట్లు ఒక ప్రధాన కారణమని అన్నారు.

## పర్యాటక అభివృద్ధికి సమన్వయ కమిటీ ఏర్పాటు

సిఎస్ రామకృష్ణ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పర్యాటక, సాంస్కృతిక రంగాల అభివృద్ధిని వేగవంతం చేయడానికి విభాగాల మధ్య సమన్వయం అత్యంత కీలకమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు అన్నారు. ఈ మేరకు సంబంధిత శాఖలతో సమన్వయ కమిటీని త్వరలో ఏర్పాటు చేసి, ప్రాజెక్టుల అమలును పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఎ.వాణిప్రసాద్ సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో సిఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పర్యాటకశాఖలో కొనసాగుతున్న కార్యక్రమాలు, ప్రాధాన్యత ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణపై సిఎస్‌కు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక మౌలిక వసతుల అభివృద్ధి, వారసత్వ, సాంస్కృతిక సంపద ప్రోత్సాహం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. ముఖ్య ప్రాజెక్టుల అమలులో సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని సిఎస్ సూచించారు. ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ, అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేసి పర్యాటక, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

## రైలు కార్యకలాపాల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం

జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన వివిధ శాఖల ప్రధానాధికారులతో కలిసి భద్రతా అంశాలను సవివరంగా పరిశీలించారు. విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.రైళ్ల రాకపోకలు సజావుగా కొనసాగేందుకు ట్రాక్‌ల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ అత్యవసరమని జీఎం స్పష్టం చేశారు. ట్రాక్ పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కీమెన్‌లు, పెట్రోల్‌మెన్‌లకు జీపీఎస్ ట్రాకర్ల వినియోగాన్ని కూడా సమీక్షించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని స్టేషన్లు, ట్రాక్‌ల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భద్రతా పనుల సమయంలో పని ప్రదేశాల్లో రక్షణ చర్యలను కచ్చితంగా పాటించాలని, విభాగాల మధ్య సమన్వయం కీలకమని పునరుద్ఘాటించారురైలు భద్రతలో ఎలాంటి రాజీ లేకుండా చర్యలు కొనసాగించాలని జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ స్పష్టం చేశారు.

# భూసార పరిరక్షణతో సుస్థిర వ్యవసాయం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూసారాన్ని పరిరక్షించడం ద్వారానే సుస్థిర వ్యవసాయం సాధ్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వ్యవసాయ శాఖ, ఇక్రిశాట్ సంయుక్త ఆధ్వర్యంలో ఇక్రిశాట్ ప్రధాన కార్యాలయంలో సాయిల్ హెల్త్ వాలంటీర్ల రెండు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమం ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, నేల ఆరోగ్యం కేవలం పంటలకే పరిమితం కాకుండా పర్యావరణం, మానవ ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మట్టి ఆరోగ్యాన్ని మెరుగుపరచడాన్ని ప్రతి ఒక్కరూ భాధ్యతగా తీసుకొని పూర్తి క్షేత్రస్థాయిలో అమలు చేసే ఉద్యమంగా మారాల్సిన అవసరముందన్నారు. నేల ఆరోగ్యంగా ఉంటేనే పౌష్టికాహారం, పర్యావరణ సమతుల్యత , మానవ శ్రేయస్సు సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణ రైజింగ్ విజన్ 2047లో భాగంగా సాగు ఖర్చులను తగ్గిస్తూ రైతుల ఆదాయాన్ని పెంచడం ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల తెలిపారు. రైతులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని, అధిక మోతాదులో వాడే రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించి, సేంద్రియ, శాస్త్రీయ మట్టి నిర్వహణ పద్ధతులను అవలంబించాలని ఆయన పిలుపునిచ్చారు. పిల్లి పెసర, జీలుగ, జనుము, మినుము, పెసర లాంటి లెగ్యూమినస్ పంటలను వేసుకొని నేల సారాన్ని పెంచుకోవల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు నూనె గింజల పంటల సాగు విషయంలో ఇక్రిశాట్ ప్రపంచవ్యాప్తంగా కృషి చేస్తోందని, శాస్త్ర విజ్ఞానాన్ని రైతుల దరి చేరవేయడమే లక్ష్యంగా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 లక్షల మట్టి నమూనాలు సేకరించి, పరీక్షలు నిర్వహించి, 100 శాతం రిపోర్టులు ఇవ్వడం జరిగింది. ఈ సంవత్సరంలో 4 లక్షల నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రైతులు శాస్త్రీయ వ్యవసాయం చేసేలా, సరైన మోతాదులో ఎరువుల వినియోగించేలా, ప్రకృతి వ్యవసాయం, ఆధునిక సాంకేతికతను రైతులకు పరిచయం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డా హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా స్టాన్ఫోర్డ్ బ్లేయిడ్ , అగ్రికల్చర్ సెక్రెటరీ సురేంద్ర మోహన్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్, ఉద్యాన యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ రాజి రెడ్డి, ఇక్రిశాట్, వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

# హరిసింగ్ ఠాకూర్ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ నాయకుడు హరిసింగ్ ఠాకూర్ (90) సోమవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో తుదిశ్వాస విడించారు. సిపిఐ అగ్ర నాయకులు రాజ్‌బహదూర్ గౌర్, బ్రీజ్‌రాణిగౌర్, దంపతుల సంతానమైన హరిసింగ్ ఠాకూర్ చిన్న వయసులోనే తెలంగాణ సాయుధ పోరాటంలో కోరియర్‌గా పనిచేశారు. ఆ తరువాత బ్యాంకు ఉద్యోగంలో చేరినప్పటికీ వ్యక్తిగత జీవిత సౌకర్యాలకన్నా ప్రజా ఉద్యమాలు, వామపక్ష రాజకీయాల పట్ల ఉన్న నిబద్ధతతో ఆ ఉద్యోగాన్ని కూడా వదిలి ప్రజా జీవితాన్ని ఎంచుకున్నారు. తుది శ్వాసవరకు ఆయన కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకంగా కావాలని ఆకాంక్షించారు. కమ్యూనిస్టులు ఒక్కటైతేనే ఈ దేశంలో మతతత్వ, ఫాసిస్టు, రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఎదుర్కొనగలమనే నమ్మకంతో ఆయన చివరి వరకు పనిచేశారు. సిపిఐ నాయకులు హరిసింగ్ ఠాకూర్ మృతి పట్ల సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా సంతాపాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. హరిసింగ్ ఠాకూర్ మరణంతో ఒక నిబద్ధత కలిగిన కమ్యూనిస్టును కోల్పోయామని ఆయన పేర్కొన్నారు. సిపిఐ నాయకులు హరిసింగ్ ఠాకూర్ భౌతికకాయాన్ని ఆప్ రాష్ట్ర నాయకులు దిడ్డి సుధాకర్ సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. హరిసింగ్ మృతితో ఒక రాజకీయ నిబద్ధత, ఉద్యమ పిలుపు, ఐక్యత స్వరం మూగబోయిందని పేర్కొన్నారు. హరిసింగ్ ఠాకూర్‌కు కమ్యూనిస్టు పార్టీ నాయకులు వెంకటస్వామి గౌడ్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రాకేష్ సింగ్, సురేందర్, సతీష్ తదితరులు నివాళులర్పించారు.



## సమస్యల వలయంలో ఆర్‌టిసి ఉద్యోగులు ఆర్‌టిసి జెఎసి

ఈ నెల 10న కార్మిక శాఖ కార్యాలయం వద్ద 'కార్మిక గర్జన'

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసిలో గత 7 సంవత్సరాలుగా కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, ఎన్నిసార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని ఆర్‌టిసి జెఎసి నాయకులు ఆరోపించారు. ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సమ్మెలోకి వెళ్ళడంతో పాటు కార్మికుల ఆవేదనను 'కార్మిక గర్జన' రూపంలో వినిపిస్తామని వారు హెచ్చరించారు. ఆర్‌టిసి జెఎసి అత్యవసర సమావేశం ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ ఇప్పటికైనా లేబర్ కమిషనర్ కన్సిలేషన్ ప్రక్రియ ప్రారంభించి, జెఎసి నాయకులతో సమావేశం నిర్వహించడంతో పాటు సమస్యల పరిష్కారం కోసం సహకరించాలని, సోమవారం జెఎసి నాయకత్వం మరొక లేఖ ద్వారా జాయింట్ లేబర్ కమిషనర్ సునీత గోపాల్ దాస్‌ని కోరడం జరిగిందని తెలిపారు. లేనియెడల 10వ తేదీన లేబర్ కమిషనర్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.
కార్మికుల హక్కులను హరించటానికి ప్రభుత్వ, యాజమాన్యాలు చీకటి బోనులో సింహాల్లా ఎదురు చూస్తున్నాయని అన్నారు. ఆర్‌టిసి జెఎసి ఇచ్చిన సమ్మె నోటీసు కారణంగా లేని సమస్యలను కార్మికుల ముందుకు తీసుకువచ్చి, కార్మికుల మనోస్థైర్యాన్ని దెబ్బ తీసేవిధంగా ప్రభుత్వం, యాజమాన్యం మైండ్ గేమ్ ఆడుతున్నాయని, కానీ వారు ఆడుతున్న గేమ్‌ని కార్మికవర్గం తిప్పికొట్టి గేమ్ ఛేంజర్ అవుతుందని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి. మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి. యాదగిరి అన్నారు. అలాగే ఆర్‌టిసి జెఎసి తలపెట్టిన 'బస్ భవన్ బచావో' కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

# కమిషన్ల కోసమే పండ్ల మార్కెట్ తరలింపు

మాజీ మంత్రి హరీష్ రావు



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** కమిషన్ల కోసమే కోహెడలో పండ్ల మార్కెట్ కు కేటాయించిన 200 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని మాజీ మంత్రి,సిద్దిపేట నియోజకవర్గం ఎంఎల్ఎ తన్నీరు హరీష్ రావు ఆరోపించారు. సోమవారం ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని కోహెడలో పండ్ల మార్కెట్ కు కేటాయించిన స్థలంలో బిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు,ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి,మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ లతో కలిసి కోహెడ పండ్ల మార్కెట్ పరిరక్షణ,భూ బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీ నగర్ లో గడ్డంన్నారం పండ్ల మార్కెట్లో ట్రాఫిక్ ఇబ్బందులను, పొల్యూషన్, ప్రజల ఆరోగ్యాలను,రైతుల శ్రేయస్సు కోసం, భవిష్యత్తులో అవసరాలను దృష్టిలో పెట్టుకొని కోహెడలో 200 ఎకరాలలో అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ నిర్మించాలని గతంలో కే సీ ఆర్ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.ఈ భూమి సేకరణలో భాగంగా మార్కెటింగ్ శాఖ ద్వారా సాగులో ఉన్న రైతులకు 10 కోట్ల రూపాయల నష్ట పరిహారం అందజేయడం జరిగిందన్నారు.మార్కెట్ నిర్మాణానికి ఆ శాఖ ద్వారా 350 కోట్ల రూపాయలను బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందని పేర్కొన్నారు.కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ నిర్మాణానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సింది పోయి మార్కెట్ భూమిని అడ్డ దారిన అమ్మేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.మూడు వేల కోట్ల రూపాయల విలువ గల భూమిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టిజిఐఐసి కి ఇచ్చి అక్కడ నుంచి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.
ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచి రెడ్డి ప్రశాంత్ రెడ్డి, నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి,దండెం రామ్ రెడ్డి,వంగేటి లక్ష్మారెడ్డి,తదితరులు పాల్గొన్నారు

## నరేంద్ర మోదీ హటావో, ఒబిసి బచావో

మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నరేంద్ర మోదీ హటావో, ఒబిసి బచావో అంటూ మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్‌ఎస్ఎస్ చేతుల్లో రిమోట్ కంట్రోల్‌లా మోదీ ప్రభుత్వం నడుస్తోందని, దేశాన్ని విభజించే ఆలోచనలే ఆ సంస్థ లక్ష్యమని ఆరోపించారు.
బిసిలు కేవలం ఓట్లు వేసే యంత్రాలేనా? వారికి అధికారంలో భాగస్వామ్యం ఉండకూడదా? అని ప్రశ్నించారు. బిసిలు ఇంకా ఎంతకాలం వెనుకబడిన పరిస్థితుల్లో ఉండాలని ఆవేదన వ్యక్తం చేసిన విహెచ్, తమ హక్కుల కోసం పోరాటానికి సిద్ధమయ్యానన్నారు. పది ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తూ మోదీ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 13న మహబూబ్‌నగర్ నుంచి ప్రారంభిస్తానని వెల్లడించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో కులగణన చేయకపోతే బిసిలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణనలో బిసిల ప్రస్తావన లేకపోవడాన్ని తప్పుబట్టారు. కులగణన తప్పనిసరిగా చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక మార్పు కోసం చదువు ముఖ్యమని మహాత్మా జ్యోతిరావు పూలే చెప్పిన విషయాన్ని గుర్తుచేసిన విహెచ్, అదే మార్గంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ముందుకెళ్లారని తెలిపారు.
రాహుల్ గాంధీ ప్రధాని అయిన తర్వాత దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని చెప్పారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులగణన చేపట్టారని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్రంలో బలంగా ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు విహెచ్ పిలుపునిచ్చారు.

తెలంగాణ ప్రభుత్వం
**ప్రజా ఆరోగ్యం మరియు పురపాలక ఇంజనీరింగ్ శాఖ**
నెం. 28/EE PH/SRD/MDK/2026-27 తేదీ: 04.04.2026
హైదరాబాద్, సంగారెడ్డి డివిజన్, ప్రజా ఆరోగ్య శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయం నుండి మెదక్ మున్సిపాలిటీలో TUIFDC రుణ సహాయం కింద చేపట్టే అభివృద్ధి పనుల కోసం ఒక టెండర్ ప్రకటన ఆహ్వానించడమైనది. ఈ పని విలువ **రూ. 42.50 లక్షలు.** టెండర్ల ప్రక్రియ **06.04.2026**న సాయంత్రం **5.00 గంటల** నుండి **13.04.2026**న సాయంత్రం **5.30 గంటల** వరకు షెడ్యూల్ చేయబడింది. వివరాల కోసం **https://tender.telangana.gov.in** ను సందర్శించండి.
సం/- కార్యనిర్వాహక ఇంజనీర్ (PH), ప్రజా ఆరోగ్య శాఖ, డివిజన్ : సంగారెడ్డి.
DIPR R.O. No. : 162-PP/CL/ADVT/2026-27, Date: 06-04-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : గాజులరామారం సర్కిల్ - 57**
NIT No. 05/DB/EE/Gajularamaram Circle-57/CMC/2025-26
**పని పేరు:** నిర్వహణ పనులు (2 నెం.లు), **అంచనా విలువ:** రూ.36.00 లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 07.04.2026న మ.3.00గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 10.04.2026న మ.3.00గం.ల వరకు, **టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం.** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9701414306, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 9063836115. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-57, సిఎంసి.
DIPR R.O. No. : 177-PP/CL/ADVT/2026-27, Date: 06-04-2026

# వరద ముప్పు నివారణే లక్ష్యం

## సున్నం చెరువు, తమ్మిడికుంట చెరువులలోకి సాఫీగా వరదనీరు

### సిఎంసి, హైడ్రా, కమిషనర్లు





ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలో వరద ముప్పును శాశ్వతంగా నివారించడంతో పాటు, చెరువుల పునరుజ్జీవనమే ధ్యేయంగా అధికారులు కసరత్తు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా సోమవారం మాదాపూర్‌లోని సున్నం చెరువు, తమ్మిడికుంట పరిసర ప్రాంతాల్లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ శృజన, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సంయుక్తంగా క్షేత్రస్థాయి పర్యటించారు. శాస్త్రీయంగా రూపొందించిన ఫీడర్ ఛానల్స్, ఇన్లెట్ వ్యవస్థల ద్వారా వర్షపు నీటిని నేరుగా చెరువుల్లోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బోరబండ బస్తీ, ఎన్.ఆర్.ఆర్. పురం ప్రాంతాల నుండి వచ్చే వరద నీరు నేరుగా సున్నం చెరువులోకి చేరేలా ఇన్‌లెట్‌లను బలోపేతం చేయాలన్నారు. మురుగునీరు చెరువుల్లో కలవకుండా అండర్ గ్రౌండ్ పైప్‌లైన్‌ల ద్వారా మళ్లించాలని స్పష్టం చేశారు. మాదాపూర్ బోరబండ మధ్య ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్‌ల కింద రోడ్డు విస్తరణ పనులను, వరద నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను పరిశీలించారు. చెరువులు నిండినప్పుడు అదనపు నీరు సురక్షితంగా బయటకు వెళ్లేలా అవుట్‌లెట్ కాలువలను పటిష్టం చేయాలని సూచించారు.

**తమ్మిడికుంట వద్ద ముమ్మర పనులు..**

కొండాపూర్, ఐటి హబ్, శిల్పారామం, మెటల్ చార్మినార్ ప్రాంతాల నుండి వచ్చే వరద నీటి వల్ల ఈ ప్రాంతాలు జలమయం కాకుండా తమ్మిడికుంటలోకి నీటిని మళ్లించేలా ప్రణాళికలు రూపొందించారు. మెటల్ చార్మినార్ రోడ్డులోని ఇన్‌లెట్‌లను గరిష్టంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట ఎస్ఎన్‌డిపి ద్వారా అదనపు వరద కాలువలను నిర్మించాలని ఆదేశించారు. చెరువుల చుట్టూ ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలని కమిషనర్లు స్పష్టం చేశారు. గత రుతుపవనాల సమయంలో చేపట్టిన పునరుజ్జీవన చర్యల వల్ల తమ్మిడికుంటకు వరద నీరు విజయవంతంగా చేరిందన్నారు. రానున్న రోజుల్లో కాలువ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేయడం ద్వారా నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సుస్థిరమైన పట్టణ డ్రైనేజి వ్యవస్థను నిర్మించేందుకు, ఆక్రమణల తొలగింపునకు సిఎంసి, హైడ్రా సంయుక్తంగా ముందుకు సాగుతాయని వారు స్పష్టం చేశారు.



## డిజిపిని కలిసిన తెలంగాణ పోలీస్ విజేతలు

ప్రజాపక్షంహైదరాబాద్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఇటీవల ముగిసిన అఖిలభారత పోలీస్ డ్యూటీ మీట్‌లో హ్యాట్రిక్ ఓవరాల్ ఛాంపియన్షిప్ పొందిన తెలంగాణ పోలీస్ ప్రతినిధులు డిజిపి బి.శివధర్ రెడ్డిని సోమవారం డిజిపి కార్యాలయంలో కలిశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్ర పోలీస్ బృందం, వరుసగా మూడో ఏడాది 'ఓవరాల్ ఛాంపియన్' ట్రోఫీని కైవసం చేసుకుని అద్భుతమైన హ్యాట్రిక్ సాధించిన విషయం విధితమే. 2023–24లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో, 2024–25లో జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన పోటీల్లోనూ విజేతగా నిలిచిన తెలంగాణ, ఇటీవల నాగ్‌పూర్ వేదికగా ముగిసిన డ్యూటీ మీట్‌లో హ్యాట్రిక్ ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించింది. ఈ సందర్భంగా తనను కలిసిన విజేతలను, అధికారులను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.సిఐడి అడిషనల్ డిజిపి చారుసిన్హా ,కోచ్ లు డి. ప్రతాప్, ఎం. రామకృష్ణ , టీమ్ మేనేజర్ కె. ప్రసాద్ , వివిధ విభాగాల విజేతలు డిజిపిని కలిసిన వారిలో ఉన్నారు.

## కొత్త రాజకీయ పార్టీలో బంజారాలకు సముచిత గౌరవం, రాజకీయ అవకాశాలు

తెలంగా ణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం/హైదరాబాద్: కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో బంజారా సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రిటైర్డ్ అడిషనల్ డిజి డిటి నాయక్,గిరిజన సంక్షేమ మాజీ కమిషనర్ కమిషనర్ లక్ష్మ ణ్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ సింగ్ నాయక్, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ భీమ్లా నాయక్, బస్కి నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి హరి నాయక్, ట్రైబల్ ఎలక్ట్రిసిటీ బోర్డు అధ్యక్షుడు నారాయణ, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ మీడియా సెక్రెటరీ భీముడు నాయక్, ఎలక్ట్రిసిటీ డిఇఇ బాలాజీ నాయక్, తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. తాము స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీలో బంజారా సమాజానికి సముచిత గౌరవం, రాజకీయ అవకాశాలు కల్పిస్తామని కవిత వారికి హామీనిచ్చారు. బంజారా సమాజం కూడా ప్రత్యేక్ష రాజకీయాల్లోకి రావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు మోహన్ నాయక్, కళ్యాణ్ నాయక్, సక్రు నాయక్, రవి రాథోడ్, శివ నాయక్, రాంజీ నాయక్, మహేందర్ నాయక్, కళ్యాణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రొఫెసర్ మహ్మద్ అన్సారీని పరామర్శించిన కవిత**

బంజారాహిల్స్ లోని వెల్ నాక్స్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మహ్మద్ అన్సారీని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

విద్యార్థులకు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ పిలుపు..



ప్రజాపక్షం/హైదరాబాద్:విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తు కోసం చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలని, మత్తు మందులకు పూర్తిగా ఉండాలని రంగారెడ్డి ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ అన్నారు. సోమవారం ప్రజా పాలన పగతిలో భాగంగా రెండు పాఠశాలల్లోని విద్యార్థులకు 'మత్తు పదార్థాలతో నిర్వీర్యం అవుతున్న యువతకు పరిష్కారాలు' అనే అంశంపై వ్యాస రచన, వకృత్వ పోటీలను జిల్లా పరిషత్ హైస్కూల్ రాయదుర్గ్, హుస్సేన్ షావాలి ఉర్దూ మీడియం పాఠశాలల్లోని 300 మంది విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో గెలుపొందిన 15 మందికి బహుమతులు, పోటీలతో పాల్గోన వారందరికి వాటర్ బాటిళ్లను అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎసితోపాటు ఎఇఎస్ జీవన్ కిరణ్, సిఐ సుబాష్, ఎస్ఐలు వెంకటేష్, రవిల, ప్రదానోపాధ్యాయులు జె.తాజ్‌బాబు, సొబన్నీసాలు పాల్గొన్నారు.

## చెరువులను ఆర్థిక వనరులుగా..

# మార్చే దిశగా అడుగులు వేయాలి

ఎంఎంసి ప్రత్యేకాధికారి జయేష్ రంజన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : చెరువులను కేవలం జలవనరులుగానే కాకుండా, ఆర్థిక వనరులుగా మార్చే దిశగా అడుగులు వేయాలని మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎంఎంసి ప్రత్యేక అధికారి జయేష్ రంజన్ అన్నారు. చెరువుల చుట్టూ ఆకర్షణీయమైన థీమ్ పార్కులను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మల్కాజ్ గిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డితో కలిసి ఆయన స్థాయీసంఘం, సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి మొత్తం 37 అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, ఆమోదం తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. నిర్ణీత గడువులోగా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏఎల్ఓ ఆపరేషన్స్ ద్వారా ఫాగింగ్ డ్రైవ్స్ నిర్వహించాలని, చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆయిల్ బాల్స్ వినియోగం, స్ప్రేయింగ్ పనులను ముమ్మరం చేయాలన్నారు. నగరంలో పచ్చదనం పెంచేందుకు వార్డుల వారీగా వృక్షారోపణ చేపట్టాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక అభివృద్ధి, ఉపాధి కల్పనలో స్వయం సహాయక గ్రూపుల పాత్రను బలోపేతం చేయాలని, సమాజ ఆధారిత కార్యక్రమాల్లో వారిని క్రియాశీలం చేయాలని నిర్ణయించారు. నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులన్ని పూర్తి కావాలన్నారు.

పరిశుభ్రత, పర్యావరణం, ప్రజా సౌకర్యాల విషయంలో రాజీ పడకుండా స్పష్టమైన మార్పు తీసుకురావాలని జయేష్ రంజన్ సూచించారు. ఈ సమావేశంలో ఎంఎంసి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ప్రపంచాన్ని శాసిస్తుంది యువతరం

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

ప్రజాపక్షం/చిక్కడపల్లి: ప్రపంచమంతా యువతపట్ల విశ్వాసాన్ని కలిగి ఉందని.. నేడు ఎన్నో రకాల ఆవిష్కరణలతో ప్రపంచాన్ని శాసిస్తుంది యువతరమేనని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటూనే యువత తమ బాధ్యతలను నిర్వర్తిస్తుందని చెప్పారు. సోమవారం బాగ్లిలింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్లో జరిగిన దుర్గాబాయ్ దేశముఖ్ ఫిజియో థెరపి కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశం ఒకప్పుడు విశ్వ గురువుగా ఉండేదని, ఐక్యత లేని కారణంగా బ్రిటిష్ వారు వచ్చి మన దేశాన్ని ఆక్రమించి పాలించారని తెలిపారు. మళ్లీ విశ్వ గురువుగా భారత్ ఉండాలనే సంకల్పంతో ప్రధాని నరేంద్రమోడీ 2047 లక్ష్యంతో వికసిత్ భారత్గా తీర్చిదిద్దడానికి ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. అందుకు యువత నడుం బిగించి మన దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం దుర్గాబాయ్ దేశముఖ్ మహిళా సభ(డిడిఎమ్ఎస్) అధ్యక్షురాలు ఉషాకంద మాట్లాడుతూ.... పూర్వ ఆంధ్ర మహిళా సభ గతంలో చేపట్టిన, ప్రస్తుతం కొనసాగుతున్న సేవా కార్యక్రమాలు, వైద్య, విద్యా సంస్థలు దతదితర వాటి గురించి వివరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## కల్వకుంట్ల కవితకు ధన్యవాదాలు

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధైర్యంగా అణగారిన కార్మిక వర్గానికి పూర్తి మద్దతు, సహకారం అందిస్తున్నందుకు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రేవంత్ రెడ్డి సర్కార్ నూతన లేబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయలేమని అసెంబ్లీలో తీర్మానం చేసే దమ్ము, ధైర్యం లేకపోవడం, ఆయన బిజెపి అనుకూల దోరణి కార్మిక వ్యతిరేక విధానాలు బయటపడుతున్నాయని చెప్పుకొచ్చారు. భారత కార్మికవర్గం 1923 నుండి 2005 వరకు అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి 44 కార్మిక చట్టాలను, వేలాది సెక్షన్లను సాధించుకున్నామని, కానీ, పార్లమెంట్‌లో ఎలాంటి చర్చలు లేకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చట్టబద్ధతలేని 4 లేబర్ కోడ్‌లను తెచ్చి ఏప్రిల్ 1 నుండి అమలు చేయటాన్ని ఆయన ఖండించారు. బిజెపి వ్యతిరేక ప్రభుత్వాలు కేరళ, తమిళనాడు, కర్నాటక, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు ఆయా అసెంబ్లీ సమావేశాలలో తీర్మానాలు చేసి కార్మిక వర్గానికి అండగా ఉంటే రేవంత్ రెడ్డి సర్కార్ అసెంబ్లీలో తీర్మానం చేయకుండా దాటవేయడం బిజెపి ప్రభుత్వ విధానాల అడుగులకు మడుగులొత్తటం శోచనీయమన్నారు. ఇకముందు కార్మిక వర్గానికి వ్యతిరేకంగా అమల్లోకి వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు భవిష్యత్తు పోరాటాలు, ఆందోళనల్లో కల్వకుంట్ల కవిత పాల్గొనాలని ఎస్.బాల్‌రాజ్ కోరారు.

## సలేశ్వరం జాతరలో సేవలందించిన అగ్నిమాపక సిబ్బంది






ప్రజాపక్షం/హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా అరణ్య ప్రాంతంలో నిర్వహించిన సలేశ్వరం జాతర–2026 సందర్భంగా భక్తుల భద్రత కోసం తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ శాఖ సిబ్బంది విశేష సేవలు అందించారు. ఈ నెల 1 నుంచి 3 వరకు జరిగిన ఈ జాతరలో వేలాది మంది భక్తులు పాల్గొనగా, క్లిష్టమైన అరణ్య మార్గాలు, మౌలిక వసతుల కొరత ఉన్నప్పటికీ అగ్నిమాపక సిబ్బంది వ్యూహాత్మక ప్రాంతాల్లో మోహరించి భద్రతా చర్యలు చేపట్టారు. అగ్ని ప్రమాదాల నివారణ, అత్యవసర ప్రతిస్పందన సిద్ధత, ప్రథమ చికిత్స సేవలు, నిరంతర పర్యవేక్షణ వంటి చర్యలతో ఎలాంటి అపరిస్థితులు తలెత్తకుండా చూసుకున్నారు. భక్తులకు సురక్షిత ట్రెక్కింగ్ పద్ధతులపై మార్గనిర్ధేశం చేయడంతో పాటు, అరణ్య ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు నివారించే చర్యలు చేపట్టారు. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ జనసంచారం నియంత్రణ, అత్యవసర పరిస్థితుల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. దూరప్రాంతంలోనూ అంకితభావంతో పని చేసిన సిబ్బంది సేవలను డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ అభినందించారు. వారి కృషి భక్తులలో నమ్మకం, భద్రతాభావాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా భక్తుల ప్రాణ రక్షణ, సురక్షిత యాత్ర అనుభవం కల్పించేందుకు శాఖ కట్టుబడి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## డిజిపిని కలిసిన నార్త్ ఈస్టర్న్ పోలీస్ అకాడమీ అధికారులు



ప్రజాపక్షం/హైదరాబాద్: మేఘాలయలోని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన నార్త్ ఈస్టర్న్ పోలీస్ అకాడమీలో ప్రాథమిక శిక్షణ పొందుతున్న తొమ్మిది మంది ప్రొబేషనరీ డిఎస్‌పిలు, ఐదుగురు క్యాడెట్ సబ్ ఇన్‌స్పెక్టర్ల బృందం 'భారత దర్శన్' అధ్యయన యాత్రలో భాగంగా తెలంగాణ రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డిని సోమవారం కలిసింది. డిజిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు తెలంగాణ రాష్ట్ర పోలీస్ పనితీరును, ఇక్కడ అమలు చేస్తున్న అత్యాధునిక సాంకేతిక విధానాలను, శాంతిభద్రతల పరిరక్షణలో అనుసరిస్తున్న విధానాలను గురించి తెలుసుకున్నారు.వివిధ రాష్ట్రాల్లోని పోలీస్ వ్యవస్థల పనితీరు, అక్కడి వృత్తిపరమైన సంస్కృతిని అధ్యయనం చేయడం ద్వారా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ఈ శిక్షణ యాత్ర ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. దేశంలోని భిన్నత్వాన్ని గమనిస్తూ, జాతీయ సమగ్రతను కాపాడటంలో పోలీసుల పాత్రను అర్థం చేసుకోవడం ఈ పర్యటనలో మరో కీలక అంశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిజిపి బి. శివధర్ రెడ్డి శిక్షణార్థులతో మాట్లాడుతూ... వృత్తిపరమైన మెళకువలను వివరించడమే కాకుండా, ప్రజా సేవలో అంకితభావంతో పనిచేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. తెలంగాణ పోలీసు విభాగం సాధించిన ప్రగతిని, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాలను యువ అధికారులు అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం భగవత్, డిప్యూటీ అసిస్టెంట్ డైరెక్టర్ పర్వేజ్ షేక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణలో ప్రజాస్వామ్య పరిరక్షణకు..

# ప్రతి కార్యకర్త ప్రజల గొంతుకగా మారాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : కోట్లాది మంది కార్యకర్తల నిస్వార్థ త్యాగాలు, అంకిత భావం వల్లే బిజెపి నేడు ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ శక్తిగా అవతరించిందని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులు మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బిజెపి జాతీయ నాయకుడు మురళీధర్ రావు, శాసన మండలి బిజెపి ఫ్లోర్ లీడర్ ఏవిఎన్ రెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాంచందర్ రావు మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పాయ్ వంటి మహనీయులు వేసిన బలమైన పునాదులపై బిజెపి అప్రతిహతంగా ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి కార్యకర్త ప్రజల గొంతుకగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రూపుదిద్దుకుంటున్న వికసిత్ భారత్ లక్ష్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

## సిఇసి తొలగింపునకు ప్రతిపక్షాల నోటీసులు

# తిరస్కరించిన ఉభయసభల అధిపతులు



న్యూఢిల్లీ:భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించేందుకు ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసులను పార్లమెంటు ఉభయ సభల అధిపతులు వేరు వేరు ఉత్తర్వుల ద్వారా తిరస్కరించారు. జ్ఞానేశ్ కుమార్‌ను భారత ప్రధాన ఎన్నికల అధిపతి పదవి నుండి తొలగించాలని కోరుతూ రాజ్యసభలో, లోక్‌సభలో ప్రతిపక్షాలు వేరు వేరుగా నోటీసులు అందజేశాయి. జ్ఞానేశ్ కుమార్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, అధికార బాధ్యతల నిర్వహణలోవివక్ష చూపిస్తున్నారని, ఓటర్ల జాబితాలకు సంబంధించి జరిగిన మోసాలు, అవినీతి చర్యలపై దర్యాప్తును ఆయన ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారనే ఆరోపణలతోపాటు అనేక ఇతర ఆరోపణలు చేస్తూ లోక్‌సభ స్పీకర్‌కు, రాజ్యసభ స్పీకర్‌కు వేరు వేరుగా ప్రతిపక్షాలు నోటీసులు సమర్పించాయి. ఐతే రాజ్యాంగంలోని 324 (5) అధికరణ కింద సిఇసి తొలగింపు తీర్మానంపై నోటీసులను తీసుకునేందుకు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ కూడా వేరు వేరు ఉత్తర్వుల ద్వారా తిరస్కరించారు. ఈ అధికరణలోని నిబంధనలతోపాటు రాజ్యాంగంలో ఉన్న చెల్లుబాటైన ఇతర నిబంధనలకు కూడా అనుగుణంగా ఈ నోటీసులను తిరస్కరించినట్లు వారు ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ''తీర్మానం నోటీసును జాగ్రత్తగా పరిశీలించాం, తీర్మానం లక్ష్యాలను సందర్భ వైఖరులను, ఇందులో ఉన్న సమస్యలను పరిశీలించాం, రాజ్యసభ ఛైర్మన్‌గా 1968 న్యాయమూర్తుల చట్టంలోని సెక్షన్ (3) ప్రకారం నోటీసును స్వీకరించేందుకు తిరస్కరిస్తున్నాం'' అని రాజ్యసభ సెక్రటరీ జనరల్ నుండి వెలువడిన నోటిఫికేషన్ పేర్కొంది. 2026 మార్చి 12వ తేదీన 63 మంది ఎంపీలు సంతకం చేసి నోటీసును రాజ్యసభ ఛైర్మన్‌కు అందజేశారు. రాజ్యాంగంలోని 324 (5) అధికరణ కింద ఈ నోటీసును ప్రతిపక్షాలు అందజేశాయి. అదేవిధంగా లోక్‌సభ సెక్రటరీ జనరల్ నుండి కూడా వెలువడిన మరో నోటిఫికేషన్ కూడా రాజ్యాంగంలోని 124 (4)లోని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ మరియు ఇతర ఎన్నికల అధికారుల (నియామకాలు, సర్వీసు నిబంధనల పరిశీలన,ఆఫీసు పదవీ కాలం) చట్టం 2023 సెక్షన్ 11 (2) కింద , 1968 జడ్జస్ (ఇంక్వైరీ) చట్టం కింద నోటీసును తిరస్కరిస్తున్నట్లు తెలియజేసింది. సిఇసి జ్ఞానేశ్ కుమార్ అనేకసార్లు అధికారంలో ఉన్న బిజెపికి అనుకూలంగా సహాయం చేశబూరని, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సర్ ప్రక్రియలో కూడా అదే పని చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపించాయి.



# 5 అసెంబ్లీ ఎన్నికలు బిజెపికి కఠిన పరీక్ష

2026 సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల రౌండ్ అప్పుడే సమీపించింది. ఐదులో మూడింటి – కేరళ, అసోం, పుదుచ్చేరి (యుటి) – అసెంబ్లీలకు ఈనెల 9న పోలింగ్ జరుగుతుంది. కాగా తమిళనాడులో ఏప్రిల్ 23, పశ్చిమ బెంగాల్‌లో రెండు విడతల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఎన్నికల కమిషన్ పోలింగ్ నిర్వహిస్తుంది. మొత్తం ఐదు అసెంబ్లీల ఓట్ల లెక్కింపు మే 4. మొత్తంగా చూస్తే గణాంకాలు ఇలా ఉన్నాయి : అర్హులైన ఓటర్లు 17.4 కోట్లు, నియోజకవర్గాలు 824; పోలింగ్ కేంద్రాలు 2.19లక్షలు; ఎన్నికల నిర్వహణ సిబ్బంది 25 లక్షలు. ప్రస్తుత ఎన్నికల్లో అధికారంలోని పార్టీల పాలనతీరుపై ప్రతిపక్షాలు, ప్రజల స్క్రూటినీ కన్నా రెండు ఇతరేతర అంశాలు ఆలోచనలను ఆక్రమించాయి. ఒకటి, భారత ఎన్నికల కమిషన్ అమలు చేస్తున్న ఓటర్ల జాబితాల ప్రక్షాళన. ఎన్నికలకు ముందు ఈ ప్రక్రియను కమిషన్ ప్రారంభించటం, ఒక్కొక్క రాష్ట్రంలో పదుల లక్షల సంఖ్యలో పేర్లు తొలగించటం సర్వత్రా చర్చనీయాంశంగా ఉంది. బెంగాల్‌లో దీనిపై పెద్ద పోరాటమే జరుగుతోంది. రెండు, పశ్చిమాసియాలో యుద్ధం. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడితో దేశవ్యాప్తంగా ఆయిలు, గ్యాస్ ధరలు, వస్తువుల ధరలు పెరిగి ప్రతి ఇంట్లో చర్చనీయాంశంగా ఉంది. ధరల పెరుగుదలకు యుద్ధం కారణం అని తెలుస్తున్నా, మోదీ ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకోకపోవటాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ట్రంప్‌కు లొంగుబాటు ప్రదర్శించి మోదీ దేశ ఆత్మగౌరవానికి భంగం కలిగించారన్న భావన విద్యావంతుల్లో, మధ్యతరగతుల్లో ఉంది. ఓటు వేసేటప్పుడు, ముఖ్యంగా వంటింటి ఖర్చులు గుర్తుకురాకమానవు!

అస్సోం మినహా మిగతా మూడు రాష్ట్రాలు బిజెపి ఏకచ్ఛత్రాధిపత్యం ఆకాంక్షను నిరోధిస్తున్న ప్రతిపక్షపార్టీల పరిపాలనలో ఉన్నాయి. అయినా బెంగాల్ లాగా ఒంటరిగానో, తమిళనాడు, కేరళలాగా కూటముల ద్వారానో (డబుల్ ఇంజిన్ సర్కార్ తదితర ప్రలోభాల ప్రచారంతో) అధికారం కోసం బిజెపి వెంపర్లాడుతున్నది. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో స్థానిక పార్టీ రంగస్వామి కాంగ్రెస్‌తో కలిసి ఏలుబడి సాగిస్తున్నది. భౌగోళికంగా చూసినా అసోం, పశ్చిమ బెంగాల్‌లు దేశ ఈశాన్య, తూర్పు భాగంలో, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి దేశ దక్షిణ భాగంలో ఉన్నాయి. అందువల్ల రాజకీయంగానేకాక సాంస్కృతికంగా, జాతీయోద్యమ ప్రభావంలో ఈ రాష్ట్రాలమధ్య ఎంతో భిన్నత్వం ఉంది. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు జాతీయోద్యమం, కమ్యూనిస్టు ఉద్యమం, నాస్తికవాదం, సంఘ సంస్కరణోద్యమాలు సనాతన ధర్మం పేరుతో సాగే దురాచారాలకు వ్యతిరేకంగా ప్రభావవంతమైన పోరాటాలు సాగించిన చరిత్ర కలవి. అందువల్లనే హిందువులు అత్యధిక మెజారిటీగా ఉన్నప్పటికీ హిందూత్వశక్తులకు ఈ రాష్ట్రాల్లో స్థానబలం దొరకలేదు. ఆర్ఎస్ఎస్, బిజెపి ఇతర హిందూత్వ నాయకులు ఈ రాష్ట్రాల్లో బయట వ్యక్తులుగానే లేదా ఉత్తరాది వారుగానే పరిగణించబడుతున్నారు. అయినా కేంద్రప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకుని హిందూత్వశక్తులు ఈ రాష్ట్రాల్లో కూడా ముస్లింలను బూచిగా చూపే తప్పుడు ప్రచారంతో విభజనవాద రాజకీయం సాగిస్తున్నారు. కేరళలో రాజకీయం రెండు కూటముల మధ్య (కమ్యూనిస్టుల ఎల్‌డిఎఫ్, కాంగ్రెస్ వారి యుడిఎఫ్) దీర్ఘకాలంగా విభజించబడి ఉన్నందున బిజెపికి అసెంబ్లీలో అడుగుపెట్టటమే కష్టంగా ఉంది. ఈ పర్యాయం వారి లక్ష్యం అధికారం కాదు – రెండు, మూడు సీట్లు సంపాదించటం. తమిళనాడులో మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం ఎఐఎడిఎంకె గ్రూపులను ఐక్యం చేయటం ద్వారా, కేంద్రంలోని అధికారం ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వంపై ప్రభావం చూపి రాష్ట్రంలో బలపడటానికి బిజెపి నాలుగేళ్లపాటు చేసిన ప్రయత్నం ఫలించలేదు. గత ఐదేళ్లలో డిఎంకె పాలన కాలంలో ఎఐఎడిఎంకె అంతర్గత వ్యవహారాల్లో వేలుపెట్టేందుకు బిజెపి ప్రయత్నించింది. తమతో పొత్తు కావాలనుకుంటే రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవి నుంచి అన్నామలైని తొలగించాలన్న అన్నా డిఎంకె నేత ఇ.పళనిస్వామి డిమాండ్‌కు అమిత్ షా తలొగ్గక తప్పలేదు. ఇప్పుడు అన్నామలైకి పోటీ చేసేందుకు పార్టీ టిక్కెట్ కూడా లభించలేదు. ఎఐఎడిఎంకె షరతులపై సీట్ల కేటాయింపుకు అంగీకరించింది. మరో గమనార్హమైన అంశం – తమిళనాడులో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడుతుందని, బిజెపి అందులో భాగస్వామి అవుతుందని అమిత్ షా అంతటివాడు స్వయానా ప్రకటిస్తే ఎఐఎడిఎంకె మాత్రం తమ సొంత ప్రభుత్వమే ఏర్పడుతుందని, అందులో ఇతరులకు స్థానం ఉండదని తమిళనాడు సాంప్రదాయాన్ని వక్కాణిస్తున్నది. డిఎంకె – బలమైన కూటమి, సుపరిపాలన రికార్డును ప్రచారం చేస్తున్నది. అధికారంలో భాగస్వామ్యం కోరిన కాంగ్రెస్‌కు తిరస్కారం ఎదురైంది. సినీనటుడు విజయ్ సొంత పార్టీతో ఎన్నికల రంగంలో ప్రవేశించటం తమిళ రాజకీయాల్లో కొత్త పరిణామం. అతను అధికారం నాదే అంటుంటే, ఇలాంటివారు తమిళ రాజకీయాల్లో కొత్త కాదు అంటున్నాయి ద్రవిడ పార్టీలు. విజయ్‌తో పొత్తుకు బిజెపి తీవ్రంగా ప్రయత్నించి విఫలమైంది. అతని ఆఖరు సినిమా విడుదల కాకుండా అడ్డుకోగలిగింది.

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వరుసగా నాల్గవసారి అధికారంకోసం బెంగాలీ సంస్కృతి ఆత్మగౌరవం పేరుతో అవిరామ పోరాటం చేస్తోంది. బిజెపి గత రెండు ఎన్నికల్లో వలె సర్వశక్తులు ఒడ్డుతూ, ఒకవైపు 'సర్' ద్వారా భారీగా ఓట్ల తొలగింపు, మరోవైపు 'ముస్లిం చొరబాటు దారుల' బూచిని చూపుతూ అధికారం మాదే అంటోంది. కాగా గత రెండు ఎన్నికల్లో (2016, 2021) సర్దుబాటుతో పోటీ చేసి నిష్ఫలమైన వామపక్ష సంఘటన, కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేస్తున్నాయి. కాగా సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ లెఫ్ట్‌ఫ్రంట్‌తో పొత్తుతో 11 సీట్లలో పోటీ చేస్తున్నది.

అసోంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం మూడవసారి అధికారం ఆశిస్తోంది. కాంగ్రెస్ పార్టీ కూటమి గట్టి పోటీ ఇస్తోంది. ఇక్కడ కూడా బిజెపిది పాతపాటే – ముస్లిం చొరబాటుదారుల ఏరివేత, కాంగ్రెస్‌పై దుష్ప్రచారం. కాంగ్రెస్‌ది గతించిన కాలం. వర్తమానం బిజెపిది. ఓటర్లు వర్తమానం నుంచే ప్రభావితం కావటం సహజం. ●



## పాకిస్థాన్ బెదిరింపులపైనా మోదీ స్పందించలేదు

**కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామని పాకిస్థాన్ రక్షణ మంత్రి హెచ్చరిస్తుంటే, మోదీ మౌనం వహించడం దారుణం. పాకిస్థాన్ రక్షణ మంత్రి చేసిన ప్రేలాపనలను బంగాల్‌లో సభలో ప్రధాని ఎందుకు ప్రస్తావించలేదు? పాక్ కోల్‌కతాపై దాడి చేస్తామని చెప్పినప్పుడు, మేం కఠిన చర్యలు తీసుకుంటాం అని మోదీ ఎందుకు అనలేదు? దేశానికి వచ్చే ఏ బెదిరింపునైనా మనం ఎలాగైతే అంగీకరించమో, అలాగే కోల్‌కతాకు వచ్చే హెచ్చరికలను కూడా మేం చూస్తూ ఊరుకోం'.**

– బంగాల్ ముఖ్యమంత్రి
మమతా బెనర్జీ




## ఆరోగ్యకర పౌర సమాజంతోనే సమగ్రాభివృద్ధి

ఆరోగ్యమే ప్రగతికి సోపానం. ఆరోగ్యమే మహాభాగ్యం. శారీరక మానసిక ఉల్లాసానికి ఊతం సంపూర్ణ ఆరోగ్యమే. దీర్ఘాయువు, మహదానంద హేతువు కేవలం మన ఆరోగ్యం మాత్రమే. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ సమతుల్యత మాత్రమే సంపూర్ణ ఆరోగ్యమని, కేవలం జ్వరం లేకపోవడం ఆరోగ్యం కాదని వివరించడం జరిగింది. ఏవీ లేకపోయినా ఆరోగ్యం వరంగా పొందిన వారు మాత్రమే భాగ్యవంతులని, అన్నీ ఉండి కూడా ఆరోగ్య సమస్యలు ఉన్న వారు నిరు పేదలుగానే పరిగణించాలి. నేటి అత్యాధునిక వేగవంతమైన డిజిటల్ యుగంలో పర్యావరణ కాలుష్యం, ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు ఆరోగ్యాన్ని నిశ్శబ్దంగా హరిస్తూనే ఉన్నాయి, ఆసుపత్రుల గిరాకీలు పెరుగుతూనే ఉన్నాయి.

**ప్రపంచ ఆరోగ్య దినోత్సవం–2026 ఇతివృత్తం:**

ప్రపంచ ఆరోగ్య సంస్థను ఏర్పాటు చేసిన శుభ సందర్భానికి గుర్తుగా 1950 నుంచి ప్రతి ఏట 07 ఏప్రిల్‌న విశ్వవ్యాప్తంగా ప్రపంచ ఆరోగ్య దినం లేదా వరల్డ్ హెల్త్ డేను పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రపంచ దేశాల ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పలు ఇతర సంస్థలు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం – 2026ను ఆరోగ్యం కోసం అందరం కలిసి : వైజ్ఞానిక శాస్త్రాన్ని తోడుగా చేసుకొని (టుగెదర్ విత్ హెల్త్ : స్టాండ విత్ సైన్స్) అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. నేటి మాతాశిశు ఆరోగ్యమే రేపటి సౌభాగ్య భవితకు పునాది అని ప్రచారం చేయడం తప్పనిసరి. మాతృ శిశు మరణాలను కట్టడి చేయడం, గర్భిణులకు పోషకాహారం అందించడం, నవజాత శిశువులను పూలలో పెట్టి కాపాడుకోవడం, మహిళాలోక ఆరోగ్యానికి ఊపిరులూదడం లాంటివి నిరంతరం విధిగా కొనసాగాలి. నేటి ఆధునిక యుగంలో సహితం సాలీనా 3 లక్షల గర్భిణి స్త్రీలు మరణించడం, 2 మిలియన్లకు పైగా శిశువులు తొలి మాసంలోనే ప్రాణాలు వదలడం, 2 మిలియన్స్ బిడ్డలు గర్భంలోనే ప్రాణాలోదలడం విచారకరం.

**సరళ జీవనశైలిని విధిగా పాటించడం:**

వేకువజామున నిద్ర లేవడం, నిత్యం శారీరక వ్యాయామం చేయడం, సరళ ఆహారపు అలవాట్లను పాటించడం, తగు సమయం నిద్ర పోవడం, సమయ పాలన పాటిస్తూ దినచర్యను అనుసరించడం, ఆశావహ దృక్పథంతో ముందుకు సాగడం, దురలవాట్లకు దూరంగా ఉండడం, రాత్రి 9 గంటలకు నిద్రించే అలవాటు చేసుకోవడం, పోషకాహారం పరిమితంగా తీసుకోవడం లాంటివి సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయని తెలుసుకొని అనుసరించే ప్రయత్నం చేద్దాం. ప్రజలకు ఆరోగ్యకర జీవనశైలి పట్ల అవగాహన కల్పించడం, వ్యాధుల వ్యాప్తి పట్ల వివరణలు, మానసిక ఆరోగ్య ప్రాధాన్యం, వైద్య ఆరోగ్య రంగానికి నిధుల కేటాయింపులో పెద్ద పీట వేయడం, మాతాశిశు ఆరోగ్యం గూర్చి ప్రచారం చేయడం, ఆరోగ్యాన్ని మింగజూస్తున్న దురలవాట్ల పట్ల హెచ్చరికలు చేయడం లాంటివి ఈ రోజున నిర్వహించడం జరుగుతుంది. ఆరోగ్యకర కుటుంబాలు, పౌర సమాజానికి పునాదులు మాతా శిశు ఆరోగ్య పరిరక్షణ మాత్రమే అని తెలుసుకుంటూ, నేటి వైద్య ఆరోగ్య పెట్టుబడి రేపు వందల రెట్ల అభివృద్ధికి పునాదులుగా మారతాయని తెలుసుకుందాం.

సమోన్నత సంతోషం, కుటుంబ శ్రేయస్సు, శాంతియుత సమాజ నిర్మాణానికి ఆరోగ్యమే వరప్రసాదమని తెలుసుకుందాం. నేటి తల్లులు, రేపటి తరాలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని బహుమతిగా అందజేద్దాం.

*(07 ఏప్రిల్ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా)*

# ఇప్పటికైనా దేశ ఆత్మగౌరవాన్ని మోదీ పునరుద్ధరిస్తారా?



ఎం. కోటేశ్వరరావు

కాలం కలిసి రాకపోతే తాడే పామై కరుస్తుందన్నది ఒక లోకోక్తి. తన కు ఎదురులేదన్నట్లుగా నల్లేరు మీద బండిలా నడుస్తున్న నరేంద్రమోడీ పరిస్థితి అలాగే ఉందా? కాలవైపరీత్యం గాకపోతే పొగిడిన మీడియా నోళ్లే అపహాస్యపు శీర్షికలు పెడతాయని ఎవరైనా ఊహించారా! తాజాగా ఒక వార్త శీర్షిక ఇలా ఉంది. ''ఇరాన్ యుద్ధ పరిహాసం: ఏడు సంవత్సరాల్లో తొలిసారి గా టెహరాన్ నుంచి చమురు తెచ్చుకోనున్న భారత్''. ఆంగ్లంలో ఐరనీ అనే పదానికి పరిహాసం, ఎగతాళి, గేలి ఇలా పర్యాయపదాలు ఎన్నో ఉన్నాయి. మీడియా ఇలాంటి శీర్షిక పెట్టటానికి కారకులు ఎవరు? కచ్చితంగా నరేంద్రమోడీ తప్ప మరొకరు కాదు. అమెరికాను పక్కన పెట్టి హార్ముజ్ జలసంధిని తెరిపించేందుకు ఐరోపాలోని ధనిక దేశాలు ప్రారంభించిన ప్రక్రియలో భాగంగా బ్రిటన్ కోరిక మేరకు 60దేశాల జాబితాలో మనం కూడా చేరాము. ఇది డోనాల్డ్ ట్రంప్‌కు కోపం తెప్పిస్తుందో ఏం పాడో, లేకపోతే ''అనుమతి'' ఇచ్చాడా, ఏదైనా జరిగి ఉండవచ్చు, ఇంకా ఇలాంటి వాటిని ఎన్ని చూడాల్సి వస్తుందో ! ఇరాన్‌పై దాడులు ప్రారంభమైన తరువాత జరిగిన పరిణామాలను కాషాయదళాలు మింగా కక్కలేకుండా ఉన్నాయి. కడుపులో ఉన్న ఇరాన్ వ్యతిరేకతను వెల్లడించలేరు, ఇజ్రాయెల్, అమెరికా అనుకూలతను దాచుకోలేని ఒక మానసిక స్థితి, దీనికి చికిత్స లేదు.

ఒక నాడు మన దిగుమతుల్లో ఇరాన్ చమురు అగ్రభాగాన ఉంది. అలాంటిది 2019 నుంచి కొనుగోలు నిలిపివేశాము.మనకు ఎక్కడ లబ్ధి ఉంటే అక్కడ కొనుక్కుంటాము అని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇతర దేశాలతో పోల్చితే ఇరాన్ చమురు ధర పెరిగిందనా, నాణ్యత పడిపోయిందనా ? ఎందుకు నిలిపివేసినట్లు, తిరిగి ఎందుకు కొనుగోలు చేస్తున్నట్లు ? జవాబుదారీ తనంలో '' ఘనత '' వహించిన పెద్దలు నోరు, మెదపరు, ఎందుకంటే దేశం కోసం ధర్మం కోసం మౌనంగా ఉన్నాం అంటారు. ఏం జరిగినా నోర్మూసుకొని ఉండాలని ఏ సనాతన ధర్మం, ఏ పురాణాలు, ఇతిహాసాలు చెప్పాయి. పాండవులకు అన్యాయం జరిగితే శ్రీకృష్ణుడి రాయబారం, సీతను తిరిగి తనవద్దకు పంపి యుద్ధాన్ని నివారించాలని వాలి కుమారుడు అంగదుడిని శాంతి సందేశంతో రావణుడి వద్దకు పంపిన రాముడు (ఇప్పుడు ఇరాన్ యుద్ధంలో మధ్యవర్తి పాత్ర పోషిస్తామన్న పాకిస్తాన్‌ను బ్రోకర్ అని చౌకబారుగా వర్ణించిన పెద్దలు ఇతిహాసాల్లో జరిగిందాన్ని కూడా అలాగే అంటారేమో ఖర్మ) గురించి చదువుకున్నాం.అందని ద్రాక్ష పుల్లన అన్నట్లు మనలను ఎవరూ నమ్మని కారణంగా ఎవరూ పిలవటం లేదు, పెద్దరికం వహించాలని కోరటం లేదు గనుక దళారీ అని కసి తీర్చుకున్నాం. ఇప్పుడు మరి 60దేశాల చొరవలో మన పాత్రను ఎలా వర్ణిస్తారో తెలియదు.

డోనాల్డ్ ట్రంప్ బెదిరిస్తే మనం మిత్రదేశమైన ఇరాన్ నుంచి చమురు దిగుమతులు నిలిపివేసి అమెరికాను ''సంతుష్టీకరించేందుకు '' ప్రయత్నించాం. ఇప్పుడు అదే అమెరికా, కావాలంటే ఇరాన్ చమురు కొనుక్కోవచ్చు అని చెప్పగానే ఉరుకులు పరుగులతో ఎగబడ్డాం.రెండూ మోడీ ఏలుబడిలోనే జరిగాయి.ఎంత ఆత్మగౌరవం ! ఇరాన్ నుంచి పింగ్ షన్ అనే చమురు టాంకరు ఆరులక్షల పీపాల చమురుతో బయలుదేరి గుజరాత్‌లోని వాడినర్ రేవుకు చేరనుందని వార్తలు. ఇరాన్, ఇతర దేశాల దగ్గర మన గౌరవం పెరిగిందా తరిగినట్లా ? రష్యా చమురు సంగతి కూడా అంతే అనుకోండి. అమెరికా ఆంక్షలను ధిక్కరించి మాస్కో నుంచి చమురు దిగుమతి చేసుకోలేదా అని అడ్డ సవాళ్లు విసిరే వారు టెహరాన్ నుంచి ఎందుకు నిలిపివేశారో చెప్పాలి. మతకోణం ఉందంటే ఉలిక్కిపడతారా ? అమెరికా ఆడించినట్లు ఆడి 145 కోట్ల ప్రజల దేశం పరువు ఎవరు తీశారు ? ఇరాన్ విషయంలో అమెరికా తన లక్ష్యాలను గుట్టుచప్పుడు కాకుండా మార్చుకుంది, హార్ముజ్ జలసంధి నుంచి మీ చమురు మీరు

> *ఇరాన్ నుంచి ఆయిలు, ఎల్ఎన్‌జి కొనుగోలు చేస్తున్నట్లు భారత ప్రభుత్వం శనివారం అధికారికంగా ధృవీకరించింది. పశ్చిమాసియా యుద్ధం మొదలయిన తర్వాత రష్యా, ఇరాన్‌ల నుంచి తాత్కాలికంగా ఆయిలు కొనుగోలు చేయవచ్చని అధ్యక్షుడు ట్రంప్ 'అనుమతి' ఇచ్చాకే ఆ రెండు దేశాలనుంచి భారత్ కొనుగోళ్లు పునఃప్రారంభమైనాయి. అయితే ట్రంప్ 'మినహాయింపుల గడువులు' దగ్గర పడుతున్నాయి. రష్యా నుంచి ఆయిలు కొనుగోలుకు ట్రంప్ భారత్‌కు నిర్దిష్టంగా ఇచ్చిన మినహాయింపు ఆదివారం ముగిసింది. అన్ని దేశాలకూ ఇచ్చిన జనరల్ మినహాయింపు ఏప్రిల్ 11న ముగుస్తుంది. ఇరాన్ ఆయిలు కొనుగోలుకు అమెరికా ఆంక్షలనుంచి ఇచ్చిన మినహాయింపు ఏప్రిల్ 19న ముగుస్తుంది. చాబహార్ ఓడరేవును వినియోగించుకునేందుకు ట్రంప్ భారత్‌కు ఇచ్చిన 6 మాసాల మినహాయింపు ఏప్రిల్ 26న ముగుస్తుంది. ఈ మినహాయింపులు ట్రంప్ పొడిగిస్తాడా? ట్రంప్ ఆంక్షలు పునరుద్ధరిస్తే భారత్ దిక్కరిస్తుందా? స్పష్టత రావాల్సి వుంది.*

తెచ్చుకోండి మేం చేసేదేమీ లేదని చేతులెత్తేశాడు ట్రంప్. మనం మాత్రం అతగాడి తోకపట్టుకు నడిచి ఇప్పుడు వ్రతం చెడ్డా ఫలం దక్కని స్థితిలో పడ్డాం.ఏం గతంలో వద్దన్నారుగా, ఇప్పుడు కావాల్సి వచ్చిందా అని ఇరాన్ అనలేదు గనుక సరిపోయిందిగాని, అని ఉంటే ? అమెరికా మబ్బులను చూసి చేతిలోని ముంతలో నీరు పారపోసుకోకూడదని గ్రహిస్తారా! అమెరికా మీద వ్యతిరేకతతో ఎత్తుగడగా భారత్ పట్ల ఇరాన్ అనుకూలంగా వ్యవహరించిందని, పోరు ముగిసిన తరువాత కూడా అదే విధంగా ఉంటుందా అనే సందేహాలు ఉన్నాయి.

ఇదిలా ఉండగా ఏప్రిల్ నాలుగవ తేదీన గుజరాత్ వాడినార్ రేవుకు చేరనుందని చెప్పిన ఇరాన్ నౌక మూడు రోజులుగా ప్రయాణ దిశ మార్చుకొని చైనా వైపు పయనిస్తున్నదని శుక్రవారం నాడు నౌకల కదలికలను నమోదు చేసే కెప్లర్ సంస్థ పేర్కొన్నది. అయితే వాణిజ్య నౌకలు ఎప్పుడు దిశమార్చుకుంటాయో తెలియదని నౌకనుంచి అందుతున్న సంకేతాలను బట్టి చివరకు అది ఎక్కడకు చేరేది చెప్పలేమని కూడా తెలిపింది. ఎందుకు ఇలా జరిగింది అన్న ప్రశ్నకు రిటోలియా అనే సంస్థ చెప్పినదాని ప్రకారం గతంలో 30 నుంచి 60 రోజుల వరకు చెల్లింపులకు గడువు ఇచ్చే వారని, ఆ చమురును అమ్మింది ఎవరో, కొనుగోలు చేసింది ఎవరో కూడా వెల్లడి కాలేదని, ఇప్పుడు ఆ షరతులను కఠినతరం గావించటం కారణం కావచ్చంటున్నారు. చెల్లింపుల సమస్య పరిష్కారమైతే తిరిగి భారత్ వైపు ప్రయాణించవచ్చని కూడా రిటోలియా పేర్కొన్నది.వాడినార్‌లో రష్యా కంపెనీ రోస్‌నెఫ్ట్‌కు చెందిన నయారాఎనర్జీ సంస్థ ఏడాదికి రెండు కోట్ల టన్నుల సామర్థ్యం గల చమురు శుద్ధి కర్మాగారాన్ని నిర్వహిస్తున్నది.

అమెరికా తన రాజకీయ ప్రయోజనం, ఆధిపత్యం, ఇరాన్ చమురును కొల్లగొట్టేందుకు, ఇజ్రాయెల్ కోసం చేసే రాజకీయాల్లో భాగంగా టెహరాన్‌పై ఆంక్షలు విధించింది. అక్కడి నుంచి చమురు కొనుగోలు చేసే వారి తాటవలుస్తామని ట్రంప్ బెదిరించాడు.చైనా మరికొన్ని దేశాలు ఖాతరు చేయకుండా దిగుమతులు చేసుకున్నాయి. అంతకు ముందు 2018–19లో మన దిగుమతి అవసరాల్లో 10–12శాతం అంటే 23–24 మిలియన్ టన్నుల ముడి చమురు ఇరాన్‌నుంచి దిగుమతి చేసుకున్నాం. ట్రంప్ 2019లో ఆంక్షలు విధించటంతో ఆ ఏడాది మే నెల నుంచి క్రమంగా తగ్గించి 2019–20లో రెండు మిలియన్ టన్నులకు పరిమితం చేసి తరువాత పూర్తిగా నిలిపివేశాం. అంతకు ముందు మనదేశానికి రాయితీలతో పాటు అప్పుకూడా ఇచ్చింది. వాటినే నరేంద్రమోడీ యుపిఏ ప్రభుత్వం చేసిన చమురు అప్పును తాను తీర్చాల్సి వచ్చిందని ప్రచారం చేయటమే గాక ఆ పేరుతో సెస్సులు, ఇతర భారాలను మోపిన అంశాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. తరువాత రష్యా నుంచి కొనుగోలు చేశాము, దాని మీద కూడా ఆంక్షలు విధించటంతో గరిష్టంగా రోజుకు 20లక్షల పీపాల దిగుమతిని ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో సగానికి తగ్గించుకున్నాం. ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన ట్రంప్ రష్యా, ఇరాన్ నుంచి చమురు తెచ్చుకోవచ్చు అంటూ మనకు ''అనుమతి'' ఇచ్చాడు. ఇప్పుడు గతంలో ఇచ్చిన రాయితీని మనం కోల్పోయాము, మార్కెట్ ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.ఎందుకీ దుస్థితి ?

యుద్ధం కారణంగా ఇప్పటికే జనం మీద భారాలు మోపటం ప్రారంభించారు,పవర్ పెట్రోల్, పరిశ్రమల్లో వాడే డీజిల్, ఇథనాల్ లేని పెట్రోలు, గృహ, వాణిజ్య గ్యాస్ ధరలను పెంచారు.ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తరువాత కచ్చితంగా ధరలు పెరుగుతాయి. ఇప్పటికి ఇప్పుడు ఇరాన్ పోరు ముగిసినప్పటికీ ఇంధన ధరలు తగ్గే అవకాశం లేదని ఐరోపా యూనియన్ హెచ్చరించింది. బ్రెంట్ రకం చమురు పీపా ధర 70 నుంచి 120 డాలర్ల వరకు పెరిగింది.మనం కొనుగోలు చేసే ముడి చమురు కూడా ఇదేవిధంగా పెరిగింది. సంక్షోభం ముగిసిన తరువాత పూర్వపు స్థితికి ధరలు దిగివస్తాయా ? జనం మీద భారం మోపటం లేదంటూనే మానసికంగా సిద్ధం చేస్తున్నారు. చమురు మార్కెట్ కంపెనీలకు వస్తున్న నష్టాలను భరించేందుకు ఎక్సయిజ్ పన్ను రద్దు చేశామని చెప్పారు.

ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పిఐబి) ద్వారా మార్చి 27న కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. నాలుగు వారాల్లో ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరలు 75శాతం పెరిగాయని తెలిపారు. అయినా కొనుగోలు ధరలకంటే తక్కువకే కంపెనీలు వినియోగదారులకు సరఫరా చేస్తున్నాయని, పెట్రోలు మీద లీటరుకు రు.26, డీజిలు మీద 81.90 నష్టం వస్తున్నదని, రెండూ కలిపితే రోజుకు రు.2,400 కోట్ల మేర వాటికి నష్టం వస్తున్నదని పేర్కొన్నారు. ఆసియాలో 30 నుంచి 50, ఉత్తర అమెరికాలో 20, ఐరోపాలో 30శాతం ఇంధన ధరలు పెరిగినట్లు పెట్రోలియం శాఖా మంత్రి హరదీప్ సింగ్ పూరీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ముందు రెండు మార్గాలు ఉన్నాయని, ఒకటి భారీగా ధరలు పెంచటం, రెండవది నష్టాలను ప్రభుత్వం భరించటం అంటూ రెండోదానికే ప్రధాని నిర్ణయించినట్లు చెప్పారు. నరేంద్రమోడీ అధికారానికి వచ్చిన తరువాత గ్యాస్ మీద నామమాత్ర సబ్సిడీ తప్ప పెట్రోలు, డీజిలు మీద సబ్సిడీ పూర్తిగా ఎత్తివేశారు. సెస్సుల పేరుతో లక్షల కోట్ల భారం మోపారు. 2022కు ముందు అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగితే ఆమేరకు పెంపు తగ్గితే తగ్గింపు అన్న విధానాన్ని అమలు చేశారు. ఆ ఏడాది ఏప్రిల్ నుంచి ఆ విధానాన్ని పక్కన పెట్టారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గినా వినియోగదారులకు తగ్గించలేదు.ముందే చెప్పుకున్నట్లు అసెంబ్లీ ఎన్నికల తరువాత అసలు రంగు బయటపడుతుంది.ప్రతి రోజుకు వస్తున్న రు.2,400 కోట్లను ప్రభుత్వం భరించాలంటే నెలకు 72వేల కోట్లు అవుతుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో యూరియా ధరలు పెరిగాయని దిగుమతులు నిలిపివేసి రైతులను ఇబ్బంది పెట్టిన పాలకులను ఎవరైనా నమ్ముతారా? గత పది సంవత్సరాల్లో దాదాపు 25లక్షల కోట్ల రూపాయలను అదనపు ఎక్సయిజ్, సెస్సు ల రూపంలో వినియోగదారుల నుంచి పిండుకున్న ఘనత మరచిపోగలమా ?

రానున్న రోజుల్లో ముడిచమురు ధరల గురించి రాయిటర్స్ మార్చినెలలో జరిపిన విశ్లేషణలో 2026లో బ్రెంట్ రకం ముడి చమురు సగటున 82.85 డాలర్లు ఉంటుదని పేర్కొన్నది. ఫిబ్రవరిలో చెప్పిన 63.85 డాలర్ల కంటే ఇది 30శాతం ఎక్కువ. యుద్ధం ఇంకా కొనసాగుతున్నందున ఈ అంచనాలు మారిపోవచ్చు.ఏప్రిల్ 11వరకు రష్యా చమురు కొనుగోలుకు ట్రంప్ '' అనుమతి '' గడువు ఉంది. తరువాత ఆ 'తలతిక్కమనిషి' ఏం చేస్తాడో తెలియదు. మార్కెట్ చరిత్రను చూస్తే 2008లో ముడి చమురు ధర గరిష్టంగా 145 డాలర్లకు చేరింది.

ఇరాన్ పోరు ఇంకా కొనసాగితే ఆ రికార్డును అధిగమించవచ్చని జోస్యం చెబుతున్నారు. సంక్షోభం మే మొదటి పక్షం వరకు కొనసాగితే 150 డాలర్లకు చేరవచ్చని జెపి మోర్గాన్స్ బ్యాంక్ ఏప్రిల్ మూడవ తేదీన పేర్కొన్నది. (మరికొన్ని సంస్థలు రెండువందల డాలర్లు అన్నాయి) అంతకు ముందు రోజు బ్రెంట్ రకం ధర 109 డాలర్లు ఉండగా సమీప భవిష్యత్‌లో 120–130 డాలర్ల మధ్య ఉండవచ్చని మోర్గాన్స్ అంచనా వేసింది. ఎలాంటి షరతులు లేకుండా హార్ముజ్ జలసంధిని ఒక వేళ ఈ రోజు తెరిచినా సరఫరా వ్యవస్థ పునరుద్ధరణకు మూడు నుంచి ఆరునెలలు పడుతుందని చమురు రంగ నిపుణులు అంటున్నారు. దాడుల్లో జరిగిన నష్టాల తీవ్రత వెల్లడైన తరువాత మరింత స్పష్టత వస్తుంది. ఇప్పటికైతే అంతా అనిశ్చితే, అస్పష్టతే !

# ఆకలి కేకల ఆర్థికం : సామాన్యుడి కంచంలో నిప్పులు



డా.సూర్యదేవర రామకృష్ణ
9490754169

దేశ ప్రగతి రథ చక్రాలు పరుగులు తీస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మనం ఐదో స్థానానికి చేరామని గణంకాలు గర్వంగా చాటుతున్నాయి. కానీ, ఆ రథ చక్రాల కింద నలిగిపోతున్న సామాన్యుడి ఆర్తనాదా లు ఎవరికి వినిపిస్తున్నాయి? ఆకాశాన్ని తాకుతున్న ధరలు, పాతాళానికి పడిపోతున్న కొనుగోలు శక్తి మధ్య ఒక సగటు పేదవాడి జీవితం ఊపిరాడని స్థితికి చేరుకుంది. ఇది కేవలం అంకెల గారడీ కాదు, కోట్లాది మంది భారతీయుల కడుపు కోత.తెల్లవారుజామున నాలుగు గంటలు. హైదరాబాద్, శివారులోని ఒక రేకుల షెడ్డులో చలి వణికిస్తున్నా, యాదగిరికి నిద్ర రావడం లేదు. ఆ రోజువారీ కూలీకి చలి కంటే రేపటి పూట గడుస్తుందా అన్న భయమే ఎక్కువ. మార్కెట్‌కు ముందే చేరుకోకపోతే ఆ రోజు కూలి దొరకడం కష్టం. కూలి దొరికితే ఆ రోజు ఇంట్లో పొయ్యి వెలుగుతుంది, లేదంటే ఆకలి కేకలే శరణ్యం. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కూలి దొరికినా కడుపు నిండని విచిత్రమైన, దారుణమైన పరిస్థితి నెలకొంది.అయ్యా, ఒకప్పుడు ఐదు వందలు వస్తే ఇల్లు హాయిగా గడిచేది. ఇప్పుడు ఏడు వందలు సంపాదించినా, సాయంత్రం ఇంటికి వెళ్లేసరికి చేతిలో చిల్లిగవ్వ మిగలడం లేదు. నూనె కొనాలంటే వందలు కావాలి, కూరగాయలు కొనాలంటే నోట్లు కరిగిపోతున్నాయి. పిల్లల చదువు, ఇంటి అద్దె, ముసలివాళ్ల మందులు ఏ ఒక్కటీ తగ్గడం లేదు. అన్నీ పెరుగుతున్నాయి, మా సంపాదన తప్ప. మేము బతకాలా? వద్దా? అంటూ యాదగిరి తుడుచుకున్న కన్నీటి చుక్కలో దేశ ఆర్థిక వ్యవస్థలోని వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. యాదగిరి ఒక్కడే కాదు, దేశవ్యాప్తంగా కోట్ల మంది ఇదే జీవన సమరం చేస్తున్నారు.

పెరుగుతున్న జీవన వ్యయం (Cost of Living) సామాన్యుడి నడ్డి విరుస్తోంది.ద్రవ్యోల్బణం (Inflation) అనే పదం వినడానికి చాలా టెక్నికల్‌గా అనిపించవచ్చు. ఆర్థికవేత్తలు టీవీ చర్చల్లో దీని గురించి గంటల తరబడి మాట్లాడుతుంటారు. కానీ సామాన్యుడికి ద్రవ్యోల్బణం అంటే నిన్న పది రూపాయలకు వచ్చిన ఉల్లిపాయ కట్ట, ఈరోజు పదిహేను రూపాయలు కావడం. నిన్న వందకు దొరికిన లీటరు నూనె, నేడు నూటయాభైకి చేరడం. ఆదాయం పెరగకుండా ఖర్చులు రెట్టింపు కావడమే పేదవాడికి తెలిసిన ద్రవ్యోల్బణం. కేంద్ర గణాంక కార్యాలయం (NSO) వెలువరించిన తాజా గణాంకాల ప్రకారం, వినియోగదారుల ధర సూచిక (CPI) గత రెండేళ్లలో ఊహించని రీతిలో పెరిగింది. ముఖ్యంగా ఆహార ధాన్యాలు, పప్పులు, వంట నూనెల ధరలు దాదాపు 25 నుండి 40 శాతం వరకు పెరిగాయి.

ఒక పేద కుటుంబం తన సంపాదనలో 70 శాతం కేవలం ఆహారం కోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది. అంటే, మిగిలిన 30 శాతంలో అద్దె, విద్య, వైద్యం, రవాణా వంటి అన్ని అవసరాలను సర్దుబాటు చేసుకోవాలి. ఇది అసాధ్యమైన పని అని వేరే చెప్పక్కర్లేదు. జీవన వ్యయం పెరగడం అనేది కేవలం ఆహారానికే పరిమితం కాలేదు. ఇది ఒక గొలుసుకట్టు ప్రక్రియలా అన్ని రంగాలను చుట్టేస్తోంది.పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన ప్రతిసారీ అది నేరుగా పేదవాడి పళ్ళెం మీద ప్రభావం చూపుతుంది.

రవాణా ఖర్చులు పెరగడంతో ప్రతి వస్తువు ధర పెరుగుతుంది. ద్రవ్యోల్బణం అనేది సమాజాన్ని సమానంగా దెబ్బతీయదు. ఇది ఒక క్రూరమైన వివక్షను చూపుతుంది. ఒక ధనవంతుడికి నూనె ధర పది రూపాయలు పెరిగితే పెద్ద తేడా ఉండదు. ఎందుకంటే అతని ఆదాయంలో ఆహార ఖర్చు కేవలం 5–10 శాతం మాత్రమే. కానీ పేదవాడికి ఆ పది రూపాయలు అంటే ఒక పూట కూర అని అర్థం.ఆర్థికవేత్త డాక్టర్ ప్రభాకర్ రావు అన్నట్లుగా, ద్రవ్యోల్బణం అనేది పేదవాడి కడుపు కొట్టి ధనవంతుడి జేబు నింపే ఒక అదృశ్య పన్ను. ధనవంతుల ఆస్తులు (బంగారం, రియల్ ఎస్టేట్) ధరలతో పాటు పెరుగుతాయి. కానీ పేదవాడి దగ్గర ఉన్న కొద్దిపాటి నగదు విలువ రోజురోజుకూ పడిపోతుంది. ఇది సామాజిక అసమానతలను పెంచి, దేశంలో అశాంతికి దారితీసే ప్రమాదం ఉంది.ఈ ధరల యుద్ధంలో ముందు వరుసలో ఉండి పోరాడుతున్నది గృహిణులు. ఈ సంక్షోభం కేవలం ఒక వర్గానికి సంబంధించింది కాదు. దేశ సమగ్ర అభివృద్ధికి ఇది ఆటంకం. దీని పరిష్కారానికి తక్షణ చర్యలు అవసరం, కనీస వేతనాలను ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు సవరించాలి. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా కూలీల ఆదాయం ఉండాలి. కేవలం బియ్యం మాత్రమే కాకుండా, నూనె, పప్పులు, వంట గ్యాస్ వంటి వాటిపై సబ్సిడీని పెంచాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను (PDS) బలోపేతం చేయాలి. ప్రైవేట్ దోపిడీని అరికట్టాలి. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది, పేదలకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన సేవలు అందించాలి. ధరల పెరుగుదలకు ప్రధాన కారణం సరఫరా లోపం. రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి, సాగును ప్రోత్సహిస్తే ఆహార కొరత తీరుతుంది, ధరలు అదుపులోకి వస్తా యి.ప్రత్యక్ష నగదు బదిలీ , అత్యంత పేద కుటుంబాలకు నెలకు కొంత కనీస ఆదాయం (Universal Basic Income) నేరుగా వారి ఖాతాల్లోకి పంపడం ద్వారా వారి కొనుగోలు శక్తిని పెంచవచ్చు.మనం ఆకాశహర్మ్యాలను నిర్మిస్తున్నాం, చంద్రమండలంపైకి రాకెట్లు పంపుతున్నాం. ఇవన్నీ గర్వించదగ్గ విషయాలే. కానీ, అదే సమయంలో దేశంలోని సగం మంది జనాభా రాత్రి పూట ఆకలితో అలమటిస్తున్నారనే వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. అభివృద్ధి అంటే కేవలం జీడీపీ అంకెలు పెరగడం కాదు, పేదల కళ్లలో ఆనందం పెరగడం.

పెరుగుతున్న జీవన వ్యయం ఒక ఆర్థిక సమస్య మాత్రమే కాదు, అది ఒక పెద్ద మానవీయ సంక్షోభం. ప్రభుత్వాలు తమ ప్రాధాన్యతలను మార్చుకోవాలి. విధాన నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఎసి గదుల్లో కూర్చుని కాకుండా, మురికివాడల్లోని పరిస్థితులను చూసి తీసుకోవాలి. అప్పుడే 'సబ్ కా వికాస్' అనేది ఒక నినాదంగా కాకుండా, ఒక నిజంగా మారుతుంది.

కోట్లాది మంది సామాన్యుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపడం, ధరల మంటల నుండి వారిని రక్షించడం నేటి సమాజం ముందున్న అతిపెద్ద సవాలు.

## సమస్యల పరిష్కానికి అధికారులపై ఒత్తిడి తెస్తాం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** సమస్యల పరిష్కారం కోసం అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ బిఆర్ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వెంకటేశ్వరకాలనీ డివిజన్ సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం మన్నె గోవర్ధన్‌రెడ్డి నవోదయ కాలనీలో రోడ్లు, స్ట్రీట్ లైట్ సమస్యలపై ఆరా తీశారు. అనంతరం బల్దియా ఏఈ మోహన్‌రావుతో ఫోన్‌లో సంభాషించి రూ.38 లక్షలకు సిసి రోడ్డు ప్రపోజల్ పెట్టినందున కాలనీ వాసులకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే రోడ్డు వెయ్యాలని కోరడం జరిగింది.

## శ్మశాన వాటిక భూమి సర్వే చేయాలి



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** పాతబస్తీలోని లలితాబాగ్ హిందూ శ్మశాన వాటిక భూమి సర్వే నిర్వహించి పూర్తి హద్దులతో ప్రహరీ నిర్మించాలని.. అందులో ఉన్న ఆక్రమణలు, అక్రమ కట్టడాలు తొలగించి గేటు ఏర్పాటు చేయాలని లలితాబాగ్ హిందూ శ్మశానవాటిక అధ్యక్షుడు అడ్డాల అశోక్‌కుమార్ సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో స్మశాన వాటిక భూములను ప్రభుత్వ అధికారులు క్రమబద్ధీకరించి రక్షించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

## దక్కన్ ఖ్యాతిని పరిరక్షించాలి



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** దక్కన్ సాంప్రదాయాన్ని పరిరక్షిస్తూ వినియోగదారులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కాలేజ్ ఎదురుగా ఏర్పాటైన సిరినే కేఫ్‌ను ఆయన ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి ప్రారంభించారు.

## బిజెపి స్థాపన దినోత్సవం



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** బిజెపి స్థాపన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి గుడ్‌విల్ హోటల్ వద్ద పార్టీ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్టీ పట్ల తమ అంకితభావాన్ని చాటుతూ, దేశాభివృద్ధి కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. దేశభక్తి నినాదాలు, కాషాయ జెండాలతో సందడి వాతావరణంలో నెలకొంది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, నాగేశ్వరరెడ్డి, అంబాల రాజు, ప్రభుగుప్తా, ఆకారం రమేష్, కుమారస్వామి, నీలి శ్రీనివాస, ముఠా గణేష్, శ్యామ్ సందీప్, అరవింద్, సతీష్‌రాజ్, రమేష్ గౌడ్, సురేష్ ముదిరాజ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఆలయంలో పూజలు



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** సంకష్ట చతుర్థి సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ సర్వీస్ సాంబశివరావు దంపతులు గణేష్ ఆలయంలో విశేష పూజలో పాల్గొనడం జరిగింది. పూజలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ కుమార్, ఆలయ బోర్డు చైర్మన్ ప్రభాకర్ యాదవ్, మెంబర్ పిల్లి మాణిక్య ప్రభు, వేణుగోపాల్, వామన్‌రావు, జెఎసి అధ్యక్షుడు, దేవాదాయ శాఖ కృష్ణమాచారి పాల్గొన్నారు.

## అమ్మ.. నాన్న కావాలి ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** జస్టిస్ చంద్రకుమార్ గొప్ప మానవతావాది.. ఆయన వ్యక్తిత్వం గొప్పదని ద్రావిడ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ కొనియాడారు. చంద్రకుమార్ రచించిన అమ్మ కావాలి నాన్న కావాలి నవలికను ఇనాక్ ఆవిష్కరించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ... రక్షణ, పోషణ, ప్రేమ, భద్రత కోసం పిల్లలు తల్లిదండ్రులపై ఆధారపడతారని అన్నారు. దాంపత్యంలో తగాదాల వల్ల భార్యాభర్తలు కోర్టు మెట్లు ఎక్కితే వారి పిల్లలకు ఎంతో దుఃఖం కలిగించిన వారు అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. సంసారంలో భార్యాభర్తల మధ్య ప్రేమ పిల్లల పట్ల తప్పకుండా ఉండాలన్నారు. రచయిత చంద్రకుమార్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు మధ్య సఖ్యత లేకపోవడం వల్లే 80 శాతం కుటుంబాల్లో బాలలు అనాథలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జల్ది విద్యాధరరావు, కృష్ణక్క డాక్టర్ కోగంటి విజయలక్ష్మి, డాక్టర్ విజయలక్ష్మి, పండిట్ రాధా కుసుమ పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల ఆందోళన

- న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి -ఆర్టిజన్ కార్మికులకు విద్యా అర్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలి
- ఎపిఎస్ఇబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్
- లేనిపక్షంలో లేనిపక్షంలో 8వ తేదీ నుంచి ఉద్యమాలు ఉధృతం చేస్తాం
- తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విద్యుత్ సౌధ ప్రధాన కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సాయిలు, వాజీర్ మాట్లాడుతూ... సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆర్టిజన్ కార్మికులకు వారి విద్యార్హతను బట్టి తగిన హోదా(కన్వర్షన్) కల్పించాలన్నారు. విద్యుత్ సంస్థల్లో ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్‌ను యథాతథంగా అమలు చేస్తూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆర్టిజన్ వేతనాల్లో ఉన్న వ్యత్యాసాలను తొలగించి, సరైన వేతనం అందించాలని కోరారు. రాష్ట్ర విద్యుత్ రంగాన్ని తమ శ్రమతో నిలబెడుతున్న ఆర్టిజన్‌లను ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరికాదు అని అన్నారు. అర్హత కలిగిన కార్మికులకు ప్రమోషన్లు, కన్వర్షన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఆర్టిజన్ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టి, వారికి తగిన సర్వీస్ బెనిఫిట్స్ కల్పించాలని అన్నారు. తమ డిమాండ్లు నెరవేరని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా 8వ తేదీ నుంచి విధులు బహిష్కరించి ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ విద్యుత్ కార్మిక సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ఆర్టిసన్ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలి



జిల్లా అదనపు కలెక్టర్ కదివరన్ పలని

**ప్రజాపక్షం/ సిటీ బ్యూరో :** ప్రజల సమస్యలపై అధికారులు సత్వరమే స్పందించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) కదివరన్ పలని చెప్పారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వాట్సాప్ ద్వారా వచ్చిన వాటిని వేగంగా పరిష్కరించాలని చెప్పారు. సోమవారం ప్రజావాణిలో మొత్తం 455 ఆర్జీలు రాగా వాటిలో గృహనిర్మాణ శాఖకు చెందినవి 369, ఫించన్‌లకు చెందినవి 55, ఇతర శాఖలకు చెందినవి 24వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, గృహనిర్మాణ సంస్థ పిడి అశోక్ చక్రవర్తి, డిఆర్‌ఓ ఈ.వెంకటాచారి ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్‌టిపి పనులు ప్రారంభించాలి

జలమండలి ఎండి అశోక్‌రెడ్డి



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** అమృత్2.0 పథకంలో నిర్మించే 39 ఎస్టీపీ ప్రాజెక్టుల్లో భాగంగా నెక్నాంపూర్ ఇబ్రహీం చెరువు వద్ద నిర్మించ తలపెట్టిన ఎస్టీపీ పనులు వెంటనే ప్రారంభించాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఎస్టీపీ నిర్మించనున్న ప్రాంతంలో ఎండీ అశోక్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే సాయిల్ టెస్ట్ పూర్తి చేయాలని.. మల్కం చెరువు నుంచి నెక్నాంపూర్ ఇబ్రహీం చెరువులో కలిసే మురుగును మళ్లించాలన్నారు. నెక్నాంపూర్ చెరువు నుంచి ఇబ్రహీం చెరువు వరకూ వర్షపు నీటి బాక్స్ డ్రైన్ నిర్మించి, బాక్స్ డ్రైన్ ఇరువైపులా ట్రంక్ సీవర్ మెయిన్ నిర్మించేందుకు ప్రణాళిక చేయుటకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ట్రంక్ సీవరుకు, మణికొండ, ల్యాంకో హిల్స్, పుప్పాలగూడ తదితర ప్రాంతాల డ్రైనేజీ లైన్లను ఎస్టీపీకి మళ్లించేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఎస్టీపీలో శుద్ధి చేసిన నీటిని గార్డెనింగ్, నిర్మాణ పనులలో వినియోగించే విధంగా ఎస్‌టిపి ప్రాంగణంలో టాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఓఆర్ఆర్ వెంట శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేందుకు పైప్‌లైన్ నిర్మించేలా డీపీఆర్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పనులు మొదలు పెట్టిన మొదలు తుదివరకు ఎస్టీపీ ప్రాజెక్టు నిర్మాణం సంబంధించిన ఫొటోలు, వీడియోలు చిత్రించి భద్రపరచాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సీజీఎం సుజాత, జీఎం, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ రహమత్‌బేగ్‌పై కేసు నమోదు
## ప్రభుత్వ ఉద్యోగులను అడ్డుకుంటే కఠిన చర్యలు

చార్మినార్ డిసిపి కిరణ్ ప్రభాకర్ హెచ్చరిక

**ప్రజాపక్షం/చార్మినార్:** విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను అడ్డుకుని దూషించడంతో పాటు దాడికి యత్నించిన వారు ఎంతటి వారైనా సహించేది లేదని.. చట్టపరమైన చర్యలు తప్పవని చార్మినార్ డిసిపి కిరణ్ ప్రభాకర్ హెచ్చరించారు. రెండు రోజుల క్రితం ముర్గిచౌక్ వద్ద ఆక్రమణల తొలగింపు డ్రైవ్ సమయంలో జరిగిన ఘటన వివరాలను డిసిపి కిరణ్ ప్రభాకర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 4న జరిగిన ఘటనలో ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, అధికారులకు రక్షణగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్‌పై భౌతిక దాడికి పాల్పడిన ఘటనలో ప్రధాన నిందితుడిని హుస్సేనీఆలం పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది. ఆక్రమణలను తొలగించే సమయంలో ముర్గి చౌక్ వద్దకు చేరుకోగానే నిందితుడు సాహిల్ అక్బర్, మాజీ కార్పొరేటర్ గౌస్, ఎంఐఎం ఎమ్మెల్సీ రహమత్ బేగ్‌లతో కలిసి చట్టవిరుద్ధంగా గుంపుగా ఏర్పడిన బృందం ఉద్దేశపూర్వకంగా అధికారులను అడ్డుకుంటూ, దూకుడుగా భయపెట్టే విధంగా ప్రవర్తించారు. ఈ గొడవలో సాహిల్ అక్బర్ అక్కడే ఉన్న కానిస్టేబుల్ ధీరజ్ తివారీపై బలప్రయోగానికి పాల్పడ్డాడు. నిందితుడు కానిస్టేబుల్‌ను పట్టుకుని హింసాత్మకంగా నెట్టివేశాడు. అంతేకాకుండా, విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల గౌరవానికి భంగం కలిగించేలా అసభ్య పదజాలంతో దూషించారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ప్రభుత్వ విధులను నిర్వహిస్తున్న ఉద్యోగులపై ఎవరూ హింసకు పాల్పడకూడదని డిసిపి కిరణ్ ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పనులకు ఆటంకం కలిగించినా లేదంటే దాడులకు పాల్పడినా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిసిపి హెచ్చరించారు.

## సృష్టి స్వరాలు ఆవిష్కరణ




**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, ప్రమీల శక్తిపీఠం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సమాఖ్య 19వ కార్యక్రమం సాహితీ సమావేశం జరిగింది. ఆచార్య ఫణీంద్ర సభకు అధ్యక్షత వహించారు. తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్ కె.యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య మసన చిన్నప్ప రచించిన సృష్టి స్వరాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మసన చెన్నప్ప గొప్ప ఆధ్యాత్మిక రచయిత అని కొనియాడారు. సమాజానికి గొప్ప సాహిత్యాన్ని అందిస్తున్నారని కీర్తించారు. సంస్కృత శ్లోకాలలో వ్యక్తిత్వ వికాసం అంశంపై సాధన నరసింహాచార్య ప్రసంగించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ దేవరాజు రాంబావుకు పుస్తకాన్ని అంకితం ఇచ్చారు. కార్యక్రమంలో కాకరాల పద్మాకర్, కెవిఎన్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కార్మికుల సమస్యలపై వారంలో సమ్మె

తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** రాష్ట్రంలోని 600 గ్యాస్ ఏజెన్సీలలో పనిచేస్తున్న 60వేల మంది కార్మికుల సమస్యలు వారంలోపు పరిష్కరించాలని తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గ్యాస్ డెలివరీ కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించాలని డిమాండ్‌చేశారు. దురదృష్టవశాత్తూ విధి నిర్వహణలో కార్మికులు ప్రమాదవశాత్తూ మరణించినా, గాయాలైనా యాజమాన్యాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలో కార్మికులకు న్యాయం దక్కాలంటే ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. రాత్రి 11 గంటల వరకు ఆఫీసులో కూర్చోబెడుతూ కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయటం సరికాదన్నారు. కార్మికులందరికీ అపాయింట్‌మెంట్ లెటర్, ఐడి కార్డు, రిజిస్టర్ సౌకర్యం కల్పించాలని కోరారు. తమ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ట్రేడింగ్ గౌరవ సలహాదారులు చామకూర రాజు, కెవి.గౌడ్, గడ్డం సత్యనారాయణ, నల్ల లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి యూనిస్, పైసా నర్సింగ్, ప్రధానకార్యదర్శి బుర్ర చంద్రయ్య, ఎర్రోళ్ల నర్సింగ్, అజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐడి, ఆధార్ కార్డు నమోదు తాత్కాలికంగా రద్దు

**ప్రజాపక్షం/ సిటీబ్యూరో:** అంబర్‌పేటలోని పోలీస్ శిక్షణా కేంద్రంలో ఈ నెల 7న ట్రాన్స్ జెండర్లకు నిర్వహించనున్న ఐడి, ఆధార్ కార్డు నమోదు కార్యక్రమం తాత్కాలికంగా రద్దు అయినట్లు దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారత శాఖ సహాయ సంచాలకులు రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ట్రాన్స్ జెండర్ల పోర్టల్ ప్రస్తుతం పనిచేయక పోవడంతో రద్దయిందని ఆయన చెప్పారు.

## బాల సాహిత్య సమ్మేళనం

ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్: బాల సాహిత్యమే భావి సాహిత్యం నినాదంతో రాష్ట్ర స్థాయిలో విస్తృతంగా బాల సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 4వ తేదీన పద్మభూషణ్ డా.కెఐ వరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలోని శాంతావసంతా ట్రస్ట్ సౌజన్యం అందిస్తున్న ఈ సమ్మేళనంలో బాల సాహిత్య రచయితలు, విద్యార్థులకు మార్గదర్శకులైన ఉపాధ్యాయులకు మరింత అవగాహన పెంచే విధంగా పలు అంశాలపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల సాహిత్య రచయితల ఉత్తమ కథలతో వెలువడే కథా సంకలనం ఆవిష్కరణ, విశేష కృషిచేసిన రచయితలకు బాల సాహితీ మూర్తి పురస్కారాలు ప్రధానం ఉంటుందని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఏప్రిల్ 20వ తేదీలోగా వాట్సాప్ నెం 9603727234 ద్వారా పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

## విజిలెన్స్ అధికారుల మంటూ బెదిరింపులు

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** గ్యాస్ డెలివరీ బాయ్‌ను బెదిరించిన ముగ్గురు యూట్యూబ్ చానల్ రిపోర్టర్స్‌పై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బ్లాక్‌లో గ్యాస్ అమ్ముతున్నావని మీ యాజమానికి చెప్పి ఉద్యోగం తీయిస్తామంటూ బెదిరింపులకు పాల్పడటంతో పాటు రూ.2 లక్షలు డిమాండ్ చేసినట్లు బాధితుడు ఆరోపించాడు. ఈ క్రమంలోనే కొత్త మొత్తం వారికి గ్యాస్ డెలివరీ బాయ్ అందించడం జరిగింది. జరిగిన విషయం ఓనర్‌కు తెలపడంతో ఓనర్ ఫిలింనగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజ్ ద్వారా నిందితులను పోలీసులు గుర్తించి వారి నుంచి రూ.23 వేలను రికవరీ చేయడం జరిగింది. ముగ్గురిని అదుపులోకి తీసుకోగా.. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు.

# పాట గెలిచింది.. తూటా ఓడింది




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** ప్రజాయుద్ధ నౌక గద్దర్‌పై పోలీస్ కాల్పులు జరిపిన రోజులు గుర్తు చేసుకుంటూ... పాటపై తూటా.. ప్రశ్నించే గొంతులుసాధించిన విజయాలు కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు గద్దర్ ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పోషించిన పాత్రను వారు గుర్తుచేసుకున్నారు. గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పోలీసుల తూటాలు, తెలంగాణ ఉద్యమం సందర్భంలో గద్దర్ పోరాట పటిమను గుర్తు చేసుకుంటూ.. సీపీఐ జాతీయ నేత డా.కె.నారాయణ మాట్లాడుతూ, గద్దర్‌తో తనకు సన్నిహిత పరిచయం ఉందన్నారు. పాట గెలిచిందని.. తూటా ఓడిపోయిందని అన్నారు. రాజ్యం, కోర్టు వివక్షతను చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సహజీవనం చేసే వారిని భార్యా భర్తలుగా పరిగణించాలని కోర్టు చెప్పడం, ఆపరేషన్ కగార్ సరికాదన్నారు. ఎర్ర జెండా నమ్ముకున్న వారంతా ఒకే గొడుగు కిందికి రావాలని నారాయణ సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సంపాదకుడు, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ... ఐదు దశాబ్దాల పాటు విప్లవంలో ఉన్న యోధుడు గద్దర్ అని కొనియాడారు. అజ్ఞాతం నుంచి బయటకు వచ్చిన గద్దర్ తెలంగాణ ఉద్యమంలో పోషించిన భూమిక కీలకమన్నారు. గద్దర్ ప్రజల గుండెల్లో చిరంజీవి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న టిజెఎస్ అధినేత, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజా జీవితంలో మార్పు తీసుకువచ్చిన యోధుడు గద్దర్ అన్నారు. తన గళంతో సామాజిక మార్పు, సమాజ చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. తెలంగాణ ఆత్మ గద్దర్ అన్నారు. రాజ్యాంగాన్ని గద్దర్ ఆయుధంగా తీసుకుని మార్పు కోసం ధైర్యంగా నిలిచారన్నారు. రాజ్యాంగ విలువలను జీవితంలో అమలు చేయాలని అన్నారు.

## పేదల ఫ్రిజ్‌ల విక్రయాలు

**ప్రజాపక్షం/అబిడ్స్:** వేసవి నేపథ్యంలో ఆరోగ్యానికి హాని కలిగించని చల్లటి మంచినీటి కోసం ప్రజలు తపిస్తుంటారు. అందుకే పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలతో పాటు ధనికులు సైతం ఇప్పటికీ మట్టి కుండల్లోని నీటిని సేవించేందుకు ప్రాధాన్యత ఇస్తుంటారు. ఆరోగ్యం విషయంలో మారుతున్న కాలనుగుణంగా ప్రజలు ఫ్రిజ్‌లు వాడుతున్నారు. కాని ఫ్రిజ్ కంటే కుండల్లోని నీరు మంచిదని వైద్యులు సైతం సూచిస్తున్నారు.ఈ క్రమంలోనే కుండల విక్రయాలు ఊపందుకున్నాయి. ఇదిలాఉండగా.. గృహిణి ప్రసన్న మాట్లాడుతూ.. వేసవిలో ఫ్రిజ్ నీటి కంటే కుండలో నిల్వ ఉంచే నీరు చాలా శ్రేష్టమైనవని.. ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన కుండలో నీటిని సేవించడం వల్ల శరీరానికి ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగిని భాగ్య మాట్లాడుతూ.. ఎండలకు కుండలో నిల్వఉంచిన నీటిని తాగడం వల్ల శరీరానికి ఉపశమనం లభిస్తుందని.. ఫ్రిజ్ నీటి కంటే మట్టికుండలోని నీటిని సేవించడం మంచిదన్నారు. ఏదేమైనా క్రమంగా ప్రతి ఇంట్లో కుండల వాడకం పెరుగుతోందని చెప్పవచ్చు.

## లవ్‌జిహాద్ నిరోధించేందుకు కఠిన చర్యలు చేపట్టాలి

విహెచ్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్

**ప్రజాపక్షం/అబిడ్స్:** తెలంగాణలో ఇటీవల వెలుగులోకి వచ్చిన లవ్ జిహాద్ ఘటనల నేపథ్యంలో హిందూ బాలికలు, మహిళల గౌరవం, భద్రత, భవిష్యత్తును కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన వైఖరిని అవలంబించాలని విహెచ్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నోముల వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. అమాయక బాలికలు, మహిళలను భావోద్వేగంగా మోసం చేసి, కుట్రపూరితంగా లక్ష్యంగా చేసుకునే ఒక వ్యవస్థీకృత విధానాన్ని ఇవి సూచిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించి, ఇలాంటి కార్యకలాపాలను అరికట్టేందుకు ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్నట్టుగా తెలంగాణ ప్రభుత్వం కూడా కఠినమైన చట్టాలను తీసుకురావాలన్నారు. బలమైన న్యాయపరమైన నిబంధనలు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసి త్వరితగతిన న్యాయం అందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# పొగాకుపై నిశ్శబ్ద పోరాటం

టొబాకో కంట్రోల్ హీరో రఘునందన్



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** పొగాకు వ్యసనం సమాజాన్ని కుదేలు చేస్తున్న నేపథ్యంలో ఒక సాధారణ ప్రభుత్వ ఉద్యోగి తన నిస్వార్థ కృషితో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆయనే పౌరసరఫరాల శాఖలో డిటిగా విధులు నిర్వహిస్తున్న మాచన రఘునందన్. ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని మాచన రఘునందన్ మాట్లాడుతూ.. పొగాకు వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించడం, ముఖ్యంగా యువతను వ్యసనాల నుంచి దూరం చేయడం జీవిత లక్ష్యంగా ఎంచుకున్నట్లు పేర్కొన్నారు. పొగాకు వల్ల సంక్రమించే వ్యాధులు, సమాజంపై కలిగే దుష్ప్రభావంపై అవగాహన కల్పిస్తూ వేలాది మందిని విముక్తులను చేసినట్లు వివరించారు. గడచిన 22 ఏండ్లుగా చేస్తున్న సేవలకుగాను టొబాకో నియంత్రణలో అత్యున్నత గౌరవమైన టొబాకో కంట్రోల్ హీరో అవార్డు వరించిందని తెలిపారు. విధుల్లో కొనసాగుతూనే.. పొగాకు మహమ్మారికి వ్యతిరేకంగా పోరాడటంతో పాటు ప్రేరణాత్మక వ్యక్తిత్వంగా చరిత్రలో నిలిచేందుకు తనవంతు కృషి చేస్తానని రఘునందన్ తెలిపారు.

## చిరువ్యాపారులకు భరోసా

**ప్రజాపక్షం/కంటోన్మెంట్ :** జూబ్లీ బస్‌స్టేషన్‌లో చిరు వ్యాపారులకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఎన్నో ఏండ్ల నుంచి జీవనం కొనసాగిస్తున్న తమ దుకాణాలను కంటోన్మెంట్ బోర్డు అధికారులు కూల్చివేశారని బాధితులు ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో విన్నవించుకున్నారు. కూల్చివేతల సందర్భంలో వాటి స్థానంలో నూతన కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి దుకాణాలు కేటాయిస్తామని చెప్పారని.. అయితే ఇప్పటికీ నిర్మాణం చేపట్టడం లేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.



## సిఐఐ భవనంలో న్యూక్లియనిక్స్ సక్సెస్ మీట్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** దేశ రక్షణరంగం, అణుశక్తి సంస్థలు, విమానాశ్రయాలు, ఓడరేవుల్లో అణు భద్రత పరికరాలు అమర్చే ఆర్డర్లను చేజిక్కించుకోవడం జరిగిందని న్యూక్లియనిక్స్ సిఎండి జె నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఐడిఏ చర్లపల్లిలోని పారిశ్రామికవేత్తల భవనంలో న్యూక్లియనిక్స్ కంపెనీ సక్సెస్ మీట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగిస్తు దేశంలోని కీలక రంగాలకు అణు రక్షణ పరికరాల ఉత్పాదకను పెంచడంతో సమిష్టిగా కృషి చేసిన ఉద్యోగులు, సిబ్బందిని ఆయన అభినందించారు. కీలక విమానాశ్రయాలలో ఇప్పటికే మొదటి దశలో 170 అత్యాధునిక పరికరాలు, రెండవ దశలో మరో 200 అత్యాధునిక అమర్చడం జరిగిందన్నారు. సంస్థ డైరెక్టర్లు నిశాంత్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డిలు ప్రసంగిస్తు త్వరలో అత్యధిక అణుశక్తి పరికరాలను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేయనున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్స్ ప్రదీప్ నారాయణ, అంకిత, జైనిక్ తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల పథకంతో నెరవేరుతున్న సొంత ఇంటి కల

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. సోమవారం కీసర డివిజన్‌లోని తిమ్మాయిపల్లి, యాదగిరిపల్లి ప్రాంతాల్లో నూతనంగా నిర్మించుకొన్న ఇందిరమ్మ ఇళ్ల ఇంటి గృహ ప్రవేశాలు చేసుకొన్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల చిరకాల సొంత ఇంటి కల నెరవేరుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు కృష్ణ యాదవ్, మధుసుధన్ రెడ్డి, రవీందర్, రమేష్, శ్రీనివాసగౌడ్, లక్ష్మణ్ శర్మ, దయానందం, బుచ్చిరెడ్డి, నరసింహ, సత్తిరెడ్డి, మల్లేష్ యాదవ్, కొండల్ చారి, రాజు యాదవ్, చిత్తారమ్మ ఆలయ చైర్మన్ మల్లేష్ యాదవ్, యాదయ్య, బాలనరసింహ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు. **పరిగిలో:** మండల కేంద్రంలో జాఫర్‌పల్లి గ్రామంలోని నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గంగా సవిత భర్త శ్రీనివాస్ నూతన గృహప్రవేశాన్ని సర్పంచు మహేష్ కుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్ని ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారులు సొంతింటి కలను నెరవేర్యకుంటున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచుఅంజయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ఎంపి నిధులు కేటాయించాలి

### మల్కాజ్‌గిరి ఎంపి ఈటలను కలిసిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ అభివృద్ధికి ఎంపి ఫండ్స్ కేటాయించాలని మూడుచింతలపల్లి కాంగ్రెస్ కౌన్సిలర్లు మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను శామీర్‌పేటలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మూడుచింతలపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో ఎంపి ఈటలను కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపి ఈటల తప్పకుండా మూడుచింతలపల్లి మున్సిపల్ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నేమూరి విష్ణు గౌడ్, మామిండ్ల శ్రీనివాస్, అశోక్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మైనార్టీ యువతకు విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేందుకు అర్హత కల్గిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నామని జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి కాంతమ్మ పేర్కొన్నారు. తెలంగాణా ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపనీ లిమిటెడ్ (TOMCOM) ద్వారా ఆస్ట్రేలియా, ఓమన్, జర్మనీ, ఖతార్ దోహా, గ్రీక్ దేశా ల్లో నర్సులు, ట్రాన్స్‌మిషన్ లైన్ టెక్నిషియన్, ఎలక్ట్రిషియన్, లాండ్రీ స్టాఫ్, టెక్నికల్ స్టాఫ్, పానెల్ బీటర్, కార్ మెకానిక్, పెయింటర్, రిసిప్షన్, లైఫ్ గార్డ్, ప్లంబర్, లాంటి పలు ఉద్యోగావకాశాలకు గాను సంబంధిత కోర్సుల్లో విద్యార్హతలు, శిక్షణ ఉన్న అభ్యర్థులు తమ కార్యాలయంలో ఈ నెల 20లోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

## ఫుట్ పాత్‌లపై షాపులు తొలగింపు

**ప్రజాపక్షం/దుండిగల్ :** సిఎంసి దుండిగల్ సర్కిల్ పరిధిలోని గండిమైసమ్మలో చౌరస్తాలో పాదచారులకు అసౌకర్యం కలిగించే విధంగా ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన తాత్కాలిక షాపులు, బోర్డులు, ఇతర



ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను దుండిగల్ సర్కిల్ అధికారులతో సమన్వయం చేసుకొని, పాదచారుల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న ఆక్రమణలను తొలగించడం ద్వారా ఫుట్‌పాత్‌లను పాదచారుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందనీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, శ్రీ వెంకటేష్ నాయక్, డిప్యూటీ కమీషనర్ దుండిగల్ టౌన్ ప్లానింగ్ ఎసిపి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## చర్లపల్లి జైలులో "నివృత్తి" మత్తు విముక్తి కేంద్రం ప్రారంభం

### మత్తు పదార్థాల దుర్వినియోగం ప్రజా ఆరోగ్య సమస్యగా నిలుస్తోంది
### గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా




**ప్రజాపక్షం/చర్లపల్లి:** మత్తు పదార్థాల దుర్వినియోగం ఒక తీవ్రమైన సామాజిక, ప్రజా ఆరోగ్య సమస్యగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. సోమవారం చర్లపల్లి కేంద్ర కారాగారంలో నివృత్తి మత్తు విముక్తి కేంద్రాన్ని గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా ఆయనను స్వాగతం పలికారు. మత్తు పదార్థాల సమగ్రంగా, పద్ధతిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని, తన రాజకీయ జీవితంలో అనేకసార్లు జైలుకు వెళ్లిన అనుభవం వల్ల ఖైదీలు, జైలు సిబ్బంది ఎదుర్కొనే సమస్యలను తాను బాగా అర్థం చేసుకున్నానని పేర్కొన్నారు. పోలీసు కానిస్టేబుల్, వార్డర్లకు సమాన వేతనాలు కల్పించేందుకు కృషి చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

ఖైదీలకు మానవీయ వాతావరణం కల్పించేందుకు జైళ్లలో ఫ్యాన్లు, టివిల వంటి సౌకార్యాలు ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. మత్తు విముక్తి కేంద్రాల వంటి కార్యక్రమాలు నషా ముక్త్ భారత్ అభియాన్ వంటి జాతీయ పథకాల లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం మత్తు పదార్థాల నిర్మూలన కోసం చేపడుతున్న చర్యలకు అనుసరంగా ఉన్నాయని గవర్నర్ అన్నారు. మత్తు వ్యసనం కేవలం శిక్షాత్మక అంశం కాకుండా ప్రజా ఆరోగ్య సమస్యగా పరిగణించి వైద్య చికిత్స, కౌన్సిలింగ్, నిరంతర పునరావాసం ద్వారా పరిష్కరించాల్సిన అవసరం ఉందని, నషాముక్త్ భారత్ అభియాన్ పరిధిలో ఏర్పాటు చేయబడినవని, చంచల్‌గూడ, చర్లపల్లి, సంగారెడ్డి, నిజామాబాద్ సెంట్రల్ జైళ్లు, హైదరాబాద్ మహిళా ప్రత్యేక జైలులో నివృత్తి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మొత్తం రెండు 2915 మంది ఖైదీలను స్క్రీనింగ్ చేయగా 590 మంది ఖైదీలు డబ్ల్యూహెచ్‌ఓ ఏఎస్ఎస్ఐఎస్‌టి అంచనాలకు లోనై కౌన్సిలింగ్, చికిత్స పొందినట్లు తెలిపారు.

అనంతరం చర్లపల్లి ఖైదీల వ్యవసాయ కేంద్రాన్ని సందర్శించారు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం తో ఏర్పాటు చేసిన ఏరియా 77 నేచర్ క్యాంప్, అడ్వెంచర్ పార్క్‌ను సందర్శించి ప్రశంసించా రు. సేంద్రియ వ్యవసాయం, తేనెటీగల పెంపకం, ఇతర జీవనోపాధి కార్యక్రమాలను పరిశీలించి ఖైదీలకు నైపుణ్యాలు అభివృద్ధి చేసి క్రమశిక్షణ, బాధ్యతగల భావాన్ని పెంపొందించడంలోఈ కార్యక్రమం కీలకమని అభినందించారు. మహిళ శిశు వికలాంగులు, వృద్ధులు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ బి శైలజ, డిసిపి సురేష్‌కుమార్‌లు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో ఐజి మురళీబాబు, డి. శ్రీనివాస్, హైదరాబాద్, చర్లపల్లి, పిపిసి పర్యవేక్షణాధికారులు శివకుమార్‌గౌడ్, ప్రమోద్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యక్షంగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించాలి

### కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని వివిధ గ్రామల నుండి వచ్చిన ప్రజలనుండి 120 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. ఇందులో ముఖ్యంగా భూ సమస్యలు ఫించన్లు, రేషన్‌కార్డులు, గృహనిర్మాణ పథకాలు, ఉపాధి అంశాలపై వినతులు అందాయి. సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ డిఆర్‌ఓ మంగీలాల్, సుధీర్, వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.





**త్రాగునీరు సమస్యల నివారణకు కంట్రోల్ రూమ్** కలెక్టర్ కార్యాలయంలో వేసవి కాలంలో త్రాగునీటి కరతను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు సమాచారకోసం 084160235291 కు కాల్ చేయువచ్చని తెలిపారు. ఎటువంటి ఇబ్బదులు ఉన్నా, త్రాగునీటి సమస్యలు, తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడిందని ఉదయం 10.30గంటల నుండి సాయంత్రం 5గంటలకు వరకు పై నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఫిర్యాదుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యమైన ఆహారం తీసుకోవడం ద్వారానే మెరుగైన జీవనం సాధ్యపడుతుందని, ప్రతిఒక్కరు ఆహారంపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. ప్రజాపాలన ప్రగతిప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని సంగం లక్ష్మిబాయి ఉన్నత పాఠశాలల్లో జిల్లా కలెక్టర్ కార్యక్రమంన్ని జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 6నుండి 11వరకు ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలిలో అలవర్చుకోవాలిన తిరు బండారాలు, భోజనశాలలు, అల్పాహార పంబంధించి నాణ్యమైన భోజనం తయరు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వార్డన్స్, సుదీర్, డిఎంహెచ్‌ఓ స్వర్ణకుమారి, తదితరుతు పాల్గోన్నారు.

## ఘనంగా సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు

### ఆశీర్వదించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** టిపిసిసి అధికార ప్రతినిధి, మూడుచింతలపల్లి మాజి జడ్పిటిసి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం కండ్లకొయలోని నిమ్మల కన్వెన్షన్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మేడ్చల్ మాజి ఎంఎల్‌ఏ మలిపెద్ది సుదీర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కొలన్ హన్మంతరెడ్డి, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి, తదితర కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి హరివర్దన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.






**ఘట్‌కేసర్ :** మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఆయన నివాసంలో పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు హరివర్ధన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ఘట్‌కేసర్ సర్కిల్ పరిధి పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు కర్రే రాజేష్, పీర్జాదిగూడ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పార్టీ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు ఎర్ర మాధవి, ఎ స్సీసెల్ అధ్యక్షులు ఎర్ర రాజులు సింగిరెడ్డి హరివర్ధ న్ రెడ్డిని కలిసి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పోక్సో కేసు నిందితుడికి జీవిత ఖైదు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** రేప్, మర్డర్ కేసు నిందితుడికి జీవిత ఖైదు విధించిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ సాయినగర్‌లో 2010 జరిగిన మైనర్ అమ్మాయి రేప్, మర్డర్ కేసులో నిందితుడు కాకర్ల అనిల్ కుమార్‌పై 2012 నుండి నాన్ బెలబుల్ వారెంట్ ఉండగా కుషాయిగూడ సిఐ భాస్కర్‌రెడ్డి చొరవతో అట్టి కేసు నిందితున్ని 2025లో నవంబర్‌లో విజయవాడలో పట్టుకుని జైలుకు తరలించడం జరిగింది. అట్టి కేసు ఫాస్ట్‌ట్రాక్ ఫోక్సో నేరేడ్‌మెట్ కోర్టు నందు విచారణ జరగడంతో జడ్జి ఆశాలత ముద్దాయికి సోమవారం జీవిత ఖైదు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చింది. కేసులో విచారణ కేసు అధికారి ముత్యంరెడ్డి, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, సతీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసచారి, కానిస్టేబుల్ శ్రీనివాస్, ఏఎస్ఐ భూములు, హెచ్‌సి సత్యం, రామచందర్, అంజయ్య, రమేష్‌లను అధికారులు అభినందించారు.

## లారీ ఢీ కొని చిన్నారి మృతి

**ప్రజాపక్షం /కొడంగల్ :** పట్టణ కేంద్రంలోనిలారీ ఢీకొనిఏళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన సోమవారం కొడంగల్ పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలిసులు తెలిపి వివరల ప్రకరం కార్గిల్ కాలనికి చెందిన చాంద్‌పాషా కుతురు అయోష పాఠశాలకు వెళ్తున్న సమయంలో రోడ్డు దటే సమయంలో సిమెంట్ లారీ ఢీ కొట్టి తల నుజ్జునుజ్జు అయింది. జరిగిన సంఘటనకు పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకుని దార్యప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజావాణిలో 177 అర్జీలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 177 అర్జీలను ధరఖాస్తుదారులు సమర్పించారు. కలెక్టర్ మనుచౌదరి డిఆర్‌ఓ చంద్రావతి, జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాధికారులతో కల్సి ప్రజావాణిలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించ లేని పక్షంలో దానికి కారణాలను సైతం ధరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.

**దుండిగల్‌లో :** ప్రజావాణిలోని ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తామని కొంపల్లి డిప్యూటీ కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం సిఎంసీ, కొంపల్లి సర్కిల్56 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను స్వీకరించారు. రాజీవ్ గృహకల్ప ప్రవేశ మార్గంలో రోడ్డుపై అడ్డంగా ఉన్న కంటైనర్‌ను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదులు అందాయనీ సంబంధిత



శాఖ అధికారులకు పంపించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకొని, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అన్నారు.

## ప్రాథమిక విద్యతోనే భవిష్యత్తుకు పునాది : జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రాథమిక విద్యతోనే భవిష్యత్తులో ఉన్నత చదువులకు పునాది పడుతుందని మేడ్చల్ జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమడి జైపాల్‌రెడ్డి



అన్నారు. సోమవారం దేవయాంజాల్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని భవిష్యత్తులో తల్లిదండ్రులకు, చదువు నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కల్యాణి, అమ్మ ఆదర్శ కమిటి చైర్మన్ కట్టా మీనా కుమారి, నాయకులు లక్ష్మి నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** జిహెచ్‌ఎంసి పరిధిలోని నాగారం డివిజన్ బిజెపి ఆధ్వర్యంలో పార్టీ 47 ఆవిర్భావ దినోత్సవం సందర్భం గా మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడు తూ గత 47 సంవత్సరాల నుండి బిజెపి నేషనల్ ఫస్ట్ అనే సిద్ధాంతంతో ముందుకు పోతుందని, నాయకులు, కార్యకర్తల త్యాగాల వల్లే కేంద్రంలో అధికారంలో ఉందని అన్నారు.



## ఆందోళనలను ఉధృతం చేస్తాం

### ఎఐటియుసి ఎం. నర్సింహ హెచ్చరిక
### సెకండ్ ఎఎన్ఎంల వేతనాల్లో బకాయిలను తిరిగి చెల్లించాలంటూ ధర్నా

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఆధార్ సహిత హాజరు పేరిట సెకండ్ ఏఎన్ఎంల వేతనాల్లో కోత విధిస్తూ తగ్గించి ఇచ్చిన వేతనాల బకాయిలను వెంటనే తిరిగి వారి ఖాతాల్లో చెల్లించాలని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నర్సింహ డిమాండ్ చేసారు. ముందస్తు సమాచారం లేకుండా ఈ విధానాన్ని అమలులోకి తెచ్చి రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల్లో కోత ఎందుకు విధించలేదని ప్రశ్నించారు. జిల్లా అధికారులు ఏఎన్ఎంల పట్ల అవలంబిస్తున్న ఏక పక్ష నిరంకుశ విధానాలకు నిరసనగా సోమవారం .జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిఎంహెచ్‌ఓ విజయకుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ఏఎన్ఎంలకు ఇచ్చే చాలీ చాలని వేతనాల్లో కోత విధించటం తీరని అన్యాయమన్నారు. డిఎంహెచ్‌ఓ విజయకుమారి ఏఎన్ఎంల పట్ల కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తోందన్నారు. ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు మాట్లాడుతూ ఎప్పటికైనా తమ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయన్న ఆశలతో అంకిత భావంతో ఏఎన్ఎంలు ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తూ రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిర్వహించిన రాత పరీక్ష రాసినా నేటి వరకు దాని ఫలితాలను సైతం వెల్లడించ లేదన్నారు. వారం రోజుల్లోగా కోత విధించిన వేతనాలు ఏఎన్ఎంలకు తిరిగి చెల్లించని పక్షంలో తాము ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర సెకండ్ ఏఎన్ఎం యూనియన్ (ఏఐటియుసి ) రాష్ట్ర కోశాధికారి ఎస్ రాజేశ్వరి రెడ్డి, రాష్ట్ర నాయకురాలు మెటల్లా, కె అనితర, మంగ, అన్నపూర్ణ, డిఇఓ యూనియన్ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.





## బడ్జెట్‌ను ఆమోదించిన కౌన్సిలర్లు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా బడ్జెట్‌ను ఆమోదించారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం రూ. 6 కోట్ల 70 లక్షలు ఓపెనింగ్ బ్యాలెన్స్ రూ. 2కోట్ల 19లక్షలు 89 వేలు, ఇంటి పన్నులు రూ. 3కోట్ల 50 లక్షలు, నాన్ ట్యాక్స్ రూ.కోటి 50 లక్షలు, మొత్తం వ్యయం రూ. 6కోట్ల 32 ల క్షల 85 వేలు, సిబ్బంది వేతనాలు రూ.3 కోట్ల 68 లక్షల 70వేలు, శానిటేషన్ ఆఫీస్ ఖర్చులు రూ. కోటి 51 లక్షల 15 వేలు, క్యాపిటల్ ఖర్చులు రూ. కోటి13 లక్షలు, మిగులు బడ్జెట్ రూ.37లక్షల 54 వేలుగా రూపొందించారు. అనంతరం చైర్మన్ జాం రవి మాట్లాడుతూ మూడుచింతలపల్లి మున్సిపాలిటిని అభివృద్ధి పరుచుటకు కౌన్సిలర్లు సహకరించాలని కోరారు. బడ్జెట్‌ను ఆమోదించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కమిషనర్ పవన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



## సిపిఐ ఆధ్వర్యంలో జోరుగా ఇంటింటి కార్యక్రమం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటి కార్యక్రమం జోరుగా కొనసాగుతుంది. సోమవారం సిపిఐ ఇంటింటి కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి మండలం కూకట్‌పల్లి డివిజన్ ప్రశాంతి నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి జి.కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన నిర్వహించిన హాస్పిటల్‌ను నేటివరకు మొదలు పెట్టకపోవడం దురదృష్టకమని అన్నారు. ఈ విషయంపై గతంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్‌కు సిపిఐ పార్టీ తరపున వినతిపత్రం ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణం చేయించినట్లయితే ఈ చుట్టుపక్కల ఉన్నటువంటి నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.మనోచారి, గంగన్న, రాములు, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.




## అనురాగ్ విశ్వవిద్యాలయంలో వార్షికోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పోచారం డివిజన్ పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయం వార్షికోత్సవాన్ని అత్యంత ఉత్సాహంతో విస్తృతంగా విద్యార్థు లు మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధ్యాపకులు విశిష్ట అతిథులను ఒకే చోటకు చేర్చిన ఈ వేడుకలో 10 వేల మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనురాగ్ సంస్థల చైర్మన్ జనగాం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ వేడుకలకు ప్రముఖ గాయని మనీషా ఎరబత్తిని ప్రసిద్ధ బాలీవుడ్, టాలీవుడ్ పాటలతో ఉత్సాహభరితమైన ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమంలో సిఇఓ నీలిమ, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ స్ట్రాటజీ అనురాగ్ పల్లా, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ ముత్తారెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ నారాయణ రెడ్డి, లక్ష్మి ప్రసన్న, డాక్టర్ కె శ్రీనివాస్, ఫార్మసీ వందన, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేష్, తారా సింగ్, డైరెక్టర్ ఈవెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

## పేదలందరికీ సొంత ఇల్లు లక్ష్యం

ఎమ్మెల్యే కాలే యాదయ్య



**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** శంకర్ పల్లి మండలం అంతప్ప గూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలందరికీ సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీరయ్య, శంకర్ పల్లి మున్సిపాలిటీ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, దశరథ్, నాయకులు చేకూర్త గోపాల్ రెడ్డి, కే. గోపాల్, పరమేశ్వర్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా ప్రభుత్వం



**ప్రజాపక్షం/షాబాద్:** నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని మక్తగూడ గ్రామంలో కేసారం జయమ్మకు చెందిన ఇందిరమ్మ ఇంటిని సర్దర్‌నగర్ మార్కెట్ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమందలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఈగ ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఖాజ మియా, శ్రీకాంత్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ రెడ్డి, సత్తయ్య, గౌరీశ్వర్, సుధాకర్ రెడ్డి కిషోర్,శేఖర్, విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈట్ రైట్-వాక్ థాన్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాల ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం శంకర్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆసుపత్రి డాక్టర్ రేవతి రెడ్డి ఆధ్వర్యంలో రైట్ డే లో భాగంగా ఈ ఏటి రైట్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మున్సిపల్ చైర్పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ యోగేష్, కౌన్సిలర్లు చాకలి అశోక్, ప్రశాంత్, నాయకులు అశోక్ కుమార్, చంద్రమౌళి, చేకూర్త గోపాల్ రెడ్డి, గుండా చంద్రశేఖర్, కే, గోపాల్, ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని ధర్మన్నగూడ గ్రామంలో ఇటివల జరిగిన ప్రిమియర్ లిగ్‌సిజన్ 6 విజేతగా నిలిచిన ధర్మన్నగూడ సూపర్ జెయింట్ జట్టు గెలుపోందినందున పాఠశాల విద్యార్థుల ఉజ్వల భవిషత్‌ను తిర్చిదిద్దాలనే ఉద్దేశంతో స్కూల్ బ్యాగులు పంపిణి చేశామని జట్లు ప్రతి నిధులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ దేవ రాజు,టీం సభ్యులు కె.పాండు చారీ, గోపాల కృష్ణ, యాదగిరి, రమేశ్, వినయ్, సురేశ్, శివ, నరేశ్,జంగయ్య, నాగరాజు, జ్యోతిబాస్,చంటి, రాఘవేందర్, సుధాకర్, ఎ. శివ, పాల్గొన్నారు.

## హుక్కాసెంటర్‌పై పోలీసులు దాడులు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న హుక్కా సెంటర్‌పై వనస్థలిపురం పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. వనస్థలిపురం ఎస్‌హెచ్‌ఓ రవిబాబు మాట్లాడుతూ వనస్థలిపురం పరిధలిలోని ఆగమయ్య నగర్‌లో ప్రభుత్వ నిబందనలకు విరుద్ధంగా చేపడుతున్న చిల్లాస్ కేఫ్ యజమానిని ఆదుపులో తీసుకున్నామన్నారు. హుక్కా సంబంధిత వస్తువులను సీజ్ చేసి వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేఫ్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నానట్లు సీఐ తెలిపారు.

## ఘనంగా బిజెపి అవిర్భావ దినోత్సవం

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల కేంద్రంలో సోమవారం బిజెపి అవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో పార్టీ జెండాను పార్టీ మండల అధ్యక్షులు జరుపుల విజయ్‌నాయక్ అధ్వర్యంలో జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మరిపల్లి అంజయ్యయాదవ్, మాజీ మండల అధ్యక్ష కార్యదర్శులు తాంద్ర రవింధర్, నడికుడి కృష్ణ మాజి సర్పంచ్ దేరంగుల రాజు,కొండమధుకర్‌రెడ్డి, సంతోష్ గుప్త,మల్లారెడ్డి, నరేశ్, నీలం రమేశ్ పాల్గొన్నారు.

**మియాపూర్:** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు హాఫీజ్‌పేట్ డివిజన్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. ఓల్డ్ హాఫీజ్‌పేట్ బి ఎల్ వై హోమ్స్ వద్ద హాఫీజ్‌పేట్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బిజెపి రవి కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నాగుల గౌడ్, మాణిక్ రావు, మనోహర్, శ్రీశైలం కురుమ, జితేందర్, సీనియర్ నాయకులు రవి గౌడ్ పాల్గొన్నారు.

**ఎల్‌బి నగర్ :** భారతీయ జనతా పార్టీ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను సోమవారం బియన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ, తాజా కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బియన్‌రెడ్డి నగర్ ఎస్‌కేటీ నగర్ చౌరస్తాలో పార్టీ జెండాను రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు.



# ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజల సమస్యల తక్షణ పరిష్కారం కోసం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి స్వయంగా బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 28 వినతులు అందగా, వాటిలో ప్రధానంగా పారిశుద్ధ్యం, డ్రైనేజి, వీధి దీపాలు, రోడ్ల మరమ్మతులకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అందిన ప్రతి వినతిని సంబంధిత విభాగాలకు పంపించామని, నిర్ణీత కాలపరిమితిలోగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్, చీఫ్ సిటీప్లానర్ బి. ప్రదీప్ కుమార్, జాయింట్ కమిషనర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

#### రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

'99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి సోమవారం పలు కాలనీల్లో క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టారు. కర్మాన్‌ఘాట్ దుర్గానగర్, చంపాపేట్ మారుతీ నగర్, హస్తినాపురం దేవకీ ఎన్‌క్లేవ్, సరూర్ నగర్ చెరువు ప్రాంతాలను ఆయన సందర్శించారు. నాలాల్లో చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దీనివల్ల వర్షాకాలంలో ముంపు సమస్యలు వస్తాయని హెచ్చరించారు. దుకాణదారులు వెంటనే ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రోడ్లపై గుంతలను వెంటనే పూడ్చాలని, అనధికార ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. చిన్న డ్రైనేజి లైన్‌లను ప్రధాన వ్యవస్థకు అనుసంధానం చేసే పనులను వేగవంతం చేయాలన్నారు. సరూర్ నగర్ చెరువులో గుర్రపుడెక్క తొలగింపును వేగవంతం చేసి, దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు.

#### అమల్లోకి వచ్చిన 'ఘన వ్యర్థాల నిర్వహణ నియమావళి - 2026'

నగరంలో పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026' ఈనెల 1 నుండి అమల్లోకి వచ్చాయని ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఈ నియమాల అమలుపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త నియమాల అమలు విధానం, బాధ్యతలపైచర్చించారు. మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీలు, గేటెడ్ కమ్యూనిటీలకు కూడా ఈ నియమాలు వర్తిస్తాయి. 2016 నిబంధనలతో పోలిస్తే, పరిధిని గ్రామ పంచాయతీలు, వ్యవసాయ ప్రాంతాల వరకు విస్తరించారు. వ్యర్థాల వర్గీకరణను 3 బిన్ విధానం నుంచి 4 బిన్ విధానంగా మార్చారు. బల్క్ వేస్ట్ గర్బేజ్ జనరేటర్స్ కోసం కొత్త నిర్వచనాలు, రిజిస్ట్రేషన్, మానిటరింగ్ వ్యవస్థలు ప్రవేశపెట్టారు. 'కాలుష్యం చేసిన వారే మూల్యం చెల్లించాలి' అనే సూత్రం ఆధారంగా పర్యావరణ పరిహారం వసూలు చేస్తారు. వ్యర్థాల తరలింపును ట్రాక్ చేసేందుకు సాంకేతికత ఎఐ, జిఐఎస్ సిస్టమ్స్ వినియోగించనున్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కమిషనర్ ఆదేశించారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సి.ఎన్. రఘుప్రసాద్, ఎస్ఈ శ్రీనివాస్, జాయింట్ కమిషనర్ మోహన్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి ప్రజావాణికి 83 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర ప్రజల సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌తో పాటు అదనపు కమిషనర్లు ఎన్.రవి కిరణ్, కె.సత్యనారాయణ, చీఫ్ సిటీ ప్లానర్ కె.శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, అదనపు చీఫ్ సిటీ ప్లానర్ ఉమాదేవి, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ అబ్దుల్ వకీల్, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ జోన్ల నుండి వచ్చిన ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 83 ఫిర్యాదులు స్వీకరించగా, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశించారు.

## ట్రాఫిక్ ఇబ్బందుల తొలగింపునకు ప్రాధాన్యం

### సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రజల సమస్యలను పరిష్కరించాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ సృజన అన్నారు. సిఎంసి కమిషనర్ శృజన, ఎమ్మెల్యే శ్రీ అరెకపూడి గాంధీతో కలిసి మియాపూర్ సర్కిల్ పరిధిలో పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్, ప్రాజెక్ట్స్, నిర్వహణ, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు. శ్రీదేవి థియేటర్ లైన్ అమీన్‌పూర్ న్యూర్ రోడ్ ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను బృందం పరిశీలించింది. అమీన్‌పూర్ బంధం కొమ్ము చెరువు రోడ్డు కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు చెరువు వెంబడి ప్రతిపాదించిన రోడ్డు విస్తరణ ప్రణాళికను కమిషనర్ సమీక్షించారు. స్థానికుల నుంచి అందిన విన్నపాలు, ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. నిర్ణీత గడువులోగా పనులన్నింటినీ పూర్తి చేయాలన్నారు. వివిధ శాఖల మధ్య సరైన సమన్వయంతో పనులు వేగవంతం చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూనే, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని, నగర మౌలిక వసతుల అభివృద్ధికి సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందని కమిషనర్ స్పష్టం చేశారు.

#### ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ సృజన ఆధ్వర్యంలో సోమవారం న్యాక్‌లో ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మొత్తం 48 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. పారిశుద్ధ్యం, చెత్తసేకరణ, డ్రైనేజీలీకేజిలు, మురుగు కాలువల సమస్యలు, రహదారుల మరమ్మతులు, గుంతల పూడ్చివేత, వీధి దీపాల నిర్వహణ, టౌన్ ప్లానింగ్, ఇతర పౌర సేవలపై ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ సమీక్షించారు. ప్రతి దరఖాస్తుదారునికి సకాలంలో న్యాయం జరిగినప్పుడే పౌర సేవలపై నమ్మకం పెరుగుతుందని కమిషనర్ సృజన అన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు గీతా రాధిక, డాక్టర్ యాదగిరిరావు, చీఫ్ సిటీప్లానర్ బి.వెంకన్న, అదనపు సిటీప్లానర్ శైలజ, జాయింట్ కమిషనర్ తిప్పర్తి యాదయ్య పాల్గొన్నారు.

## వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి



### ఆర్‌డిఓ అనంతరెడ్డి

**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఓ అనంతరెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో జిల్లా వైద్య, ఆరోగ్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 99రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎస్సీ కాలనీలోని బస్తీ దావఖాన నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు హెల్త్ వీక్ వాకథాన్ కార్యక్రమాన్ని ఆర్‌డిఓ అనంతరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆర్డీఓ మాట్లాడుతూ మార్నింగ్ వాక్ వల్ల ఉల్లాసం, శరీర ధారుఢ్యం పెంపొందించటాకి దోహద పడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునిత, డిప్యూటి డిఎంఎచ్ఓ లక్ష్మి ప్రసన్న, సిడిపిఓ వినీతదేవి, మున్సిపల్ కమీషనర్ సుదర్శన్, డాక్టర్లు బుస్రా, విజేందర్, రాజ్‌కుమార్, సిఎచ్ఓ రామయ్య, హెమ్‌లాల్, వయోలా, మేరి, జ్యోతి, రఘుకుమార్, వేణు, స్టాఫ్‌నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పరిగడ్డ గ్రామపంచాయతీని అభివృద్ధి చేస్తా



### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉప్పరిగడ్డ గ్రామ పంచాయతీని అభివృద్ధి చేస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం, అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం సర్పంచ్ చందునాయక్ చేస్తున్న కృషిని అభినందించారు. గ్రామ అభివృద్ధికి, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకోని బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన్నట్టు ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్రీలత, అయ్యావారిపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు బాలరాజ్, శ్రీను, బీమ్లా నాయక్, మహిళ అధ్యక్షురాలు రజిత పాల్గొన్నారు.

## తెలంగాణ బిడ్డలందరికీ ఉద్యోగాలివ్వండి

### బిఆర్ఎస్ శాసనసభపక్ష ఉపనేత సబితా ఇంద్రారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** క్రీడాకారులు అయితే ఉద్యోగాలు పక్కా.. అంటు పదేపదే ముఖ్యమంత్రి చెప్పడం సంతోషం అని, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన ఒకరిద్దరికీ కాదు, ముందుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో రాణిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ ఉద్యోగాలు ఇవ్వండని బిఆర్ఎస్ శాసన సభపక్ష ఉపనేత సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంచి క్రీడాకారులు కావాలంటే పాఠశాల స్థాయి నుండే శిక్షణా ఇవ్వాలి కదా. శిక్షణ ఇవ్వటానికి పిఇటిలు ఉండాలి కదా. అందుకు అనుగుణంగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న,1804 పోస్టులు ఎందుకు భర్తీ చేయటం లేదని ఆమె ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలకు కెసిఆర్ రూ.20 కోట్లు కేటాయిస్తే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎందుకు రద్దు చేశారన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా బడ్జెట్ విడుదల చేయలేదని సబితా రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎంఎల్ఎలతో నిర్వహించిన ఆటల పోటీలకు రూ.18కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం, విద్యార్థుల ఆటపాటల కోసం రూ.8 కోట్లు లేవా సిఎంగారు అని ప్రశ్నించారు. మట్టిలో మాణిక్యాలు వెలికితీయాలంటే ఒక ప్రత్యేక విజన్‌తో ముందుకు వెళ్ళాలని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

## 21వ రోజుకు గ్రీన్‌ఫీల్డ్ రైతులు దీక్షలు

**ప్రజాపక్షం/యాచారం :** మా ప్రాణాలు పోయిన గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం భూములు ఇచ్చే ప్రసక్తే లేదని గిరిజన భాదిత రైతులు హెచ్చరించారు. గ్రీన్ ఫిల్డ్ రోడ్డు నిర్మాణ భాదితులు చేస్తున్న రిలే నిరాహాహర దీక్షలు 21 వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం మాయ మాటలు చెప్పి భూములు కాజేయాలని చూస్తే ఎలాంటి పరిస్థితులనైనా ఎదురు కుంటామని రైతులు హెచ్చరించారు. ఇబ్బందులకు గురి చేసి భూసేకరణ చేయాలని చూస్తే సహించేది లేదని రైతులు హెచ్చరించారు. ఫార్మ



సిటికి రైతులను మోసం చేసి భూములు బలవంతగా తీసుకున్నారు. గ్రీన్ రోడ్డు నిర్మాణలో గిరిజన రైతుల భూములు తీసుకోవాలని ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు.

# ఆరోగ్యం కోసం సమతుల్యమైన ఆహారం

### రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఆరోగ్యం కోసం సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని, ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండి, పండ్లు, కూరగాయలు, ధాన్యాలు వంటి సహజ పోషకాలు ఎక్కువగా తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి(డిఎంఅండ్‌హెచ్‌ఒ)డాక్టర్ కె.లలితాదేవి పిలుపునిచ్చారు. ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా సోమవారం నుంచి వారంరోజుల పాటు నిర్వహించనున్న హెల్త్ వీక్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రతపై ప్రత్యేక దినోత్సవం సందర్భంగా సోమవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని భాస్కర మెడికల్ కాలేజీ, ఎన్‌టిఆర్ స్కూల్ విద్యార్థులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మున్సిపల్, మెప్మాకు చెందిన సిబ్బందితో నిర్వహించిన సురక్షిత, పోషకాహారంపై అవగాహనకు చేపట్టిన "ఈట్ రైట్ వాక్ థాన్"ర్యాలీని డిఎంహెచ్ఒ డాక్టర్ లలితాదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ సోనియా దర్శన్, వివిధ శాఖల అధికారులతో కలిసి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లలితాదేవి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం నుంచి వారం రోజులపాటు హెల్త్ వీక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ర్యాలీని నిర్వహించడం జరిగిందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదని, అందుకే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం తోపాటు శరీరానికి చక్కటి వ్యాయామాన్ని అందించిప్రతి వ్యక్తి ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేపట్టిన కార్యక్రమంలో సరైన ఆహారం ఆరోగ్య భవిష్యత్తు ప్లకార్డులు ప్రదర్శించారు.



**350 మందికి శిక్షణ..** భాస్కరా మెడికల్ కాలేజీలో సురక్షిత ఆహార నిర్వహణ పద్ధతులు, ఆహారంతో పాటు నీటి ద్వారా వచ్చే వ్యాధులను నివారణపై 350 మందికి శిక్షణ నిర్వహించారు. చేతులు కడుక్కోవడంపై ప్రదర్శన అదనంగా ఫుడ్ బిజినెస్ ఆపరేటర్ల రిజిస్ట్రేషన్, లైసెన్సింగ్ చేపట్టి అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అదేవిధంగా ఐసిడిఎస్, అంగన్‌వాడీ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మిల్లెట్ మేళా నిర్వహించి పోషక ఆహారంపై అవగాహన కల్పించారు. చేవెళ్ల మార్కెట్ యార్డ్ వద్ద మధ్యాహ్నం 3 నుండి 4 గంటల వరకు ఫుడ్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్, సెక్రెటరీ డైరెక్టర్ ఫుడ్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

